


www.vibharenews.com

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL | ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర్ రెడ్డి | గురువారం 09-02-2023 | సంపుటి : 04 | సంచిక : 146 | పేజీలు : 4 | వెల : రూ 3-00


## విభజన చట్టం ప్రకారం రాజధానిగా అమరావతిని నోటిఫై చేశారు: కేంద్రం



దిల్లీ: విభజన చట్టం ప్రకారమే ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతి ని 2015లో ఏపీ ప్రభుత్వం నోటిఫై చేసిందని కేంద్రం తెలిపింది.బుధవారం వైకాపా పార్లమెంటరీ నేత విజయసాయిరెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానందరాయ్ లిఖిత పూర్వక సమాధానమిచ్చారు. విభజన చట్టంలోని సెక్షన్ 5, 6 ప్రకారం రాష్ట్ర రాజధాని ఏర్పాటుకు సంబంధించిన విషయంపై అధ్యయనం చేసి నివేదిక ఇచ్చేందుకు నిపుణుల కమిటీని ఏర్పాటు చేసిందని.. ఈ కమిటీ ఇచ్చిన సూచనలు, సలహాలు, నివేదికలన్నింటినీ రాష్ట్ర ప్రభుత్వానికి పంపించగా.. దాన్ని పూర్తి స్థాయిలో అధ్యయనం చేసి రాజధానిగా అమరావతినే ఎంపిక చేస్తూ నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్ క్యాపిటల్ రీజినల్ డెవలప్‌మెంట్ అథారిటీని ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఓ చట్టాన్ని తీసుకొచ్చినట్లుగా కేంద్ర హోంమంత్రిత్వ శాఖ పార్లమెంట్‌కు వివరించింది.ఇదే సందర్భంలో 2020లో ఏపీసీఆర్‌డీఏను రద్దు చేసినట్టుగా, మూడు రాజధానుల ప్రతిపాదనలు తీసుకొస్తున్నట్లుగా రాష్ట్ర ప్రభుత్వం కొత్త బిల్లును తీసుకొచ్చిందన్నారు. అనంతరం ఆ బిల్లును వెనక్కి తీసుకుంటూ ఏపీసీఆర్‌డీఏ చట్టాన్ని కొనసాగింపుగా మరొక బిల్లును ముందుకు తీసుకొచ్చినట్లుగా కేంద్ర ప్రభుత్వం వివరించింది. రాజధానికి సంబంధించిన అంశం రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉంటుందని కేంద్ర ప్రభుత్వం చెప్పిందా? అనే ప్రశ్నకు ఈ మేరకు సమాధానం ఇచ్చారు. ఏపీ రాజధాని అంశం సుప్రీంకోర్టు పరిధిలో ఉంది కాబట్టి దీనికి సంబంధించి ఇంతకుమించి చెప్పడానికి ఏమీ లేదని కేంద్రం స్పష్టం చేసింది. ప్రస్తుతం ఈ అంశం కోర్టులో ఉందని పేర్కొంది. దీనిపై మాట్లాడటం సబ్‌జ్యుడిస్ అవుతుందని లిఖిత పూర్వక జవాబు ఇచ్చింది.

## పార్లమెంట్‌లో విపక్షాలను ఏకిపారేసిన మోదీ..

### రాహుల్ వ్యాఖ్యలకు స్ట్రాంగ్ కౌంటర్..

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ పార్లమెంటులో ప్రసంగించారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే చర్చలో భాగంగా ఆయన లోక్‌సభలో మాట్లాడారు.రాష్ట్రపతి ప్రసంగం దేశ ప్రజలందరికీ మార్గ నిర్దేశం చేసిందని అన్నారు.మంగళవారం సభలో కొందరు చాలా ఉత్సాహంగా వ్యాఖ్యలు చేశారని పరోక్షంగా రాహుల్ గాంధీని ఉద్దేశించి మోదీ అన్నారు. అవి చూసి చాలా మంది థ్రిల్ అయ్యారని సెటైర్లు వేశారు. ఆ వ్యాఖ్యలు వారి మనసులోని ద్వేషాన్ని బయటపెట్టాయని కౌంటర్ ఇచ్చారు. భారత్ తన సమస్యల పరిష్కారం కోసం ఒకప్పుడు ఇతరులపై ఆధారపడేదని, ఇప్పుడు భారతే ఇతరుల సమస్యలను పరిష్కరించే స్థాయికి చేరుకుందని రాష్ట్రపతి అన్నారని గుర్తు చేశారు. తాము దేశంలో అవినీతిని నిర్మూలించామని మోదీ అన్నారు. ఈ క్షణం కోసం దేశం చాలా ఏళ్లుగా ఎదురుచూసిందని పేర్కొన్నారు.'ఇవాళ జీ-30 నిర్వహించే స్థాయికే భారత్ ఎదగడం గర్వకారణం. ఇది కొంతమందికి కంటగింపు కావచ్చు. నాకైతే గర్వకారణమే. నిరాశలో ఉన్న కొందరు దేశ ప్రగతిని అంగీకరించలేకపోతున్నారు. చాలా దేశాలను నిరుద్యోగం, ద్రవ్యోల్బణం వేధిస్తున్నాయి. భారత్ మాత్రం బలమైన ఆర్థిక శక్తిగా ఎదుగుతోంది. దేశ విజయాన్ని కొందరు జీర్ణించుకోలేకపోతున్నారు.మొబైళ్ల తయారీలో భారత్ రెండో స్థానంలో ఉంది. ఇంధన వినియోగంలో మూడో స్థానంలో ఉంది. 104 యూనికార్న్లు ఈ మధ్య ఏర్పడ్డాయి. 150 దేశాలకు వ్యాక్సిన్లు పంపించాం. వ్యాక్సిన్ సర్టిఫికేట్లు క్షణాల్లో మొబైల్లో ప్రత్యక్షమవుతున్నాయి. ప్రపంచం మొత్తం భారత్ వైపు చూస్తోంది. ప్రతి రంగంలో భారత్ చరిత్ర సృష్టిస్తోంది. ఇవన్నీ కొందరికి కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. మా విజయాలు చూసి నిరాశవాదులకు నిద్రపట్టడంలేదు. వారు ప్రశాంతంగా పడుకోలేక పోతున్నారు.2014 నుంచి ఇప్పటిదాకా మా ప్రభుత్వం ఏం చేసిందో దేశ ప్రజలకు తెలుసు. ప్రజలు పదే పదే మాకు మద్దతు ఇస్తున్నారు. 2004-14 వరకు దేశంలో అవినీతి రాజ్యమేలింది. భారీ కుంభకోణాలు జరిగాయి. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ఉగ్రవాదం రాజ్యమేలింది. 2జీ, బొగ్గు స్కాం, కామన్‌వెల్త్ క్రీడల్లో అవినీతి జరిగింది. 2004-14 అనేది దేశంలో అవినీతి దశాబ్దమైంది. దేశంలో ఆ పదేళ్లు రక్తపుటేరుల పారాయి.టెలికాం మూమెంట్ 2జీ స్కామ్ అయింది. న్యూక్లియర్



మూమెంట్ ఓటుకు నోటు అయ్యింది. కామన్‌వెల్త్ గేమ్స్ మూమెంట్ సీడబ్ల్యూసీ స్కామ్ అయింది. ఆ దశాబ్ద కాలం భారత్ తీవ్రంగా నష్టపోయింది. అవినీతిపై కొరడా ఝుళిపిస్తే దర్యాప్తు సంస్థలను తప్పుబడుతున్నారు.' అని కాంగ్రెస్‌కు మోదీ గట్టి కౌంటర్ ఇచ్చారు.'అవినీతిపై చర్యలు తీసుకుంటున్న దర్యాప్తు సంస్థలపై విపక్షాలన్నీ విమర్శలు గుప్పిస్తాయి. విపక్షాలన్నింటినీ ఈడీ ఏకతాటిపైకి తెచ్చింది. అందుకు ఈడీకీ థ్యాంక్స్ చెప్పాలి. కరోనా టైంలో విపక్షాలు విచిత్రంగా మాట్లాడాయి. కరోనా వల్ల భారత్ పతనంపై హార్వర్డ్ యూనివర్సిటీలో పరిశోధనలగు జరుగుతున్నాయన్నాయి. కానీ కాంగ్రెస్ పతనంపై హార్వర్డ్‌లో పరిశోధన జరిగింది. మిగతా వర్సిటీలు కూడా దీనిపై పరిశోధలను జరిపాయి.మోదీపై బురదజల్లి లబ్ధి పొందాలని విపక్షాలు అనుకుంటున్నాయి. టీవీలు, పేపర్లలో నాపై వివర్శలు చేసి లబ్ధి పొందలేరు. దేశ ప్రజలకు నాపై విశ్వాసం ఉంది. వన్ నేషన్ వన్ రేషన్‌తో లబ్ధి పొందిన పేదలు మీ మాటలు నమ్ముతారా? ప్రధాన మంత్రి ఆవాస్ యోజనతో సొంతింటి కల సాకారం చేసుకున్న సామాన్యులు మీ విమర్శలు నమ్ముతారా? కొందరు ఒకే కుటుంబానికి సేవ చేస్తారు. కానీ 25 కోట్ల కుటుంబాల్లో నేను సభ్యుడిని. 140 కోట్ల మంది ప్రజలే నాకు రక్షణ కవచం. దాన్ని మీరు ఛేదించలేరు' అని మోదీ విపక్షాలను ఏకిపారేశారు.మరోవైపు మోదీ ప్రసంగానికి ముందే బీఆర్ఎస్ సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. అదానీ వ్యవహారంపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ వేయాలని వారు డిమాండ్ చేయగా.. స్పీకర్ దీన్ని పరిగణనలోకి తీసుకోలేదు. దీంతో బీఎర్ఎస్ ఎంపీలు సభను వీడారు.

## అన్నింటికీ తెగించిన వాళ్లే నాతో ఉన్నారు: ఎమ్మెల్యే కోటంరెడ్డి



నెల్లూరు: ఫోన్ ట్యాపింగ్‌పై దర్యాప్తు జరిపించాలని కేంద్ర హోంశాఖకు లేఖ రాసినట్లు వైకాపా తిరుగుబాటు ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు.అపాయింట్‌మెంట్ దొరకగానే నేరుగా వెళ్లి అధికారులకు ఫిర్యాదు చేస్తానని చెప్పారు. నెల్లూరులో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫోన్ ట్యాపింగ్ జరిగిందని ఆరోపిస్తే మంత్రులు, వైకాపా (జూఖీఅఖ) నేతలు తనపై విమర్శలు చేస్తున్నారన్నారు. తనకు ఇంకా బెదిరింపులు వస్తున్నాయని చెప్పారు. అన్నింటికీ తెగించిన వాళ్లే తనతో ఉన్నారని కోటంరెడ్డి వ్యాఖ్యానించారు. ఎన్నికేసులైనా పెట్టుకోవచ్చని.. అవి తమకు కొత్త కాదన్నారు. దేనికైనా సిద్ధమని చెప్పారు. ప్రజాస్వామ్యయుతంగా.. రాజ్యాంగబద్ధంగా పోరాడతామన్నారు."నేను ఆరోపణలు చేస్తే మీరు కూడా సరైన పద్ధతిలో మాట్లాడాలి. నాపై శాపనార్థాలు, విమర్శలు చేయడమే పనిగా పెట్టుకున్నారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో రోడ్లు, వాటర్ వర్క్సపై మాట్లాడితే తప్పా?కాంట్రాక్టర్ పనులు ఆపేస్తే ప్రజలు ఇబ్బందిపడే పరిస్థితి వచ్చింది. సగంలో పనులు ఆగిపోయాయి.. కేవలం రూ.10కోట్లు విడుదల చేస్తే సరిపోతుంది. రోడ్లు సరిగా లేక ప్రమాదాలు జరుగుతున్నాయి. పొట్టేపాలెం బ్రిడ్జి వద్ద రోడ్డు సమస్యను సీఎంకు నేరుగా చూపించా. ప్రభుత్వం నిధుల విడుదల చేసి కాంట్రాక్టర్‌కు సూచనలు చేస్తే బాగుంటుంది. నియోజకవర్గంలోని పెండింగ్ పనులు, రోడ్ల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈనెల 17న జిల్లా కలెక్టరేట్, 25న ఆర్అండ్‌బీ శాఖ కార్యాలయం ముందు ధర్నా చేస్తాం" అని కోటంరెడ్డి తెలిపారు.

## ఏపీ కేబినెట్ భేటీలో కీలక నిర్ణయాలు




ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం కొనసాగుతోంది. సచివాలయంలోని మొదటి బ్లాక్‌లోని మంత్రివర్గ సమావేశ మందిరంలో నిర్వహించిన కేబినెట్ భేటీలో బడ్జెట్ సమావేశాలు, పలు కీలక అంశాలపై చర్చించి ఆమోదం తెలిపారు.భారీ పరిశ్రమల ఏర్పాటు ప్రతిపాదనలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ బోర్డు ప్రతిపాదనలను కేబినెట్‌లో చర్చించి ఆమోదం తెలిపారు. సుమారు రూ.లక్షా 45 వేల కోట్ల పెట్టుబడులకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఏపీ కేబినెట్ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకుంది. న్యూఎనర్జీ పార్క్ ఏర్పాటుకు కేబినెట్ గ్రీన్‌సిగ్నల్.. 2 విడతల్లో మొత్తంగా రూ.1.10 లక్షల కోట్లతో న్యూఎనర్జీ పార్క్.. 1000 మెగావాట్ల చొప్పున విండ్, సోలార్ ప్రాజెక్టులకు కేబినెట్ ఆమోదం తెలిపింది.ఎన్టీపీసీ ఆధ్వర్యంలో అనకాపల్లి జిల్లా పూడిమడక వద్ద న్యూ ఎనర్జీ పార్కు ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మొదటి విడతలో రూ.55 వేల కోట్లు, రెండో విడతలో రూ.55వేల కోట్లు పెట్టుబడికి అంగీకారం తెలిపింది. మొత్తంగా రూ.1,10,000 కోట్ల పెట్టుబడిని ప్రభుత్వం పెట్టనుంది. ఫేజ్ వన్‌లో 30 వేల మందికి, ఫేజ్ టూ లో 31వేల మందికి ఉద్యోగాలు కల్పించనున్నారు. నాలుగు విడతల్లో మొత్తంగా రూ.10,500 కోట్ల పెట్టుబడి పెట్టనుండగా? 2 వేల మందికి ఉద్యోగాలు కల్పించనున్నారు.అలాగే వైజాగ్ టెక్ పార్కుకు 60 ఎకరాలు కేటాయించడంతో పాటు, వంద మెగావాట్ల డేటా సెంటర్ ఏర్పాటుకు మంత్రివర్గం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కొత్త పాలసీలో భాగంగా పంప్డ్ స్టోరేజ్ హైడ్రో ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది. బందరు పోర్టు కు పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా రూ. 3940 కోట్ల రుణం తీసుకునేందుకు మంత్రివర్గం అంగీకారం తెలియజేసింది. 9.75 శాతం వడ్డీతో రూ. 3940 కోట్ల రుణం తీసుకోనుంది. అటు నెల్లూరు బ్యారేజీకి నల్లపురెడ్డి శ్రీనివాసులు రెడ్డి బ్యారేజీగా పేరు మార్చేందుకు కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. గ్రానైట్ కంపెనీలకు విద్యుత్ రాయితీలకు అంగీకారం తెలిపిన కేబినెట్? యూనిట్‌కు రూ. 2 చొప్పున వసూలు చేయాలని నిర్ణయించింది.కొన్ని జిల్లాల కేంద్రాలను అర్బన్, రూరల్ మండలాలుగా విభజించేందుకు మంత్రివర్గం ఆమోద ముద్ర వేసింది. విజయనగరం, ఏలూరు, మచిలీపట్నం, ఒంగోలు, నంద్యాల, అనంత, చిత్తూరు జిల్లా కేంద్రాలను అర్బన్, రూరల్ మండలాలుగా విభజించాలని నిర్ణయించింది. తాడేపల్లిగూడెంలో పోలీస్ సబ్ డివిజన్ ఏర్పాటుకు కేబినెట్ అంగీకారం తెలిపింది. వైద్యారోగ్య శాఖలో రిక్రూట్‌మెంట్ కోసం ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేయాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ఏపీ మెడికల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఏర్పాటుకు అంగీకారం తెలిపింది.

## ఏపీ మంత్రి రోజాను కలిసిన ప్రముఖ పర్వతారోహకురాలు ఆశా మాలవీయ

అమరావతి: మహిళా భద్రత, సాధికారత అంశాలను విస్తృతంగా సమాజంలోకి తీసుకువెళ్లాలనే లక్ష్యంతో సైకిల్‌పై దేశయాత్ర నిర్వహిస్తున్న ప్రముఖ పర్వతారోహకురాలు ఆశా మాలవీయను రాష్ట్ర పర్యాటక, క్రీడలు, యూత్ అడ్వాన్సుమెంట్ ఢ సాంస్కృతిక శాఖ మంత్రి ఆర్.కె.రోజా అభినందించారు.ఆశా మాలవీయలక్ష్యం నెరవేరాలని మంత్రి ఆకాంక్షించారు. బుధవారం సచివాలయంలోని చాంబర్‌లో ఆశా మాలవీయ మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసారు. తాను చేస్తున్న సైకిల్ యాత్ర లక్ష్యాన్ని మాలవ్య మంత్రికి వివరించారు.ఈ సందర్భంగా మంత్రి రోజా మాట్లాడుతూ.. రాష్ట్రంలో మహిళా భద్రత, సాధికారత సాధనకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి మాలవీయకు వివరించారు. కిశోర బాలికలు ఎలాంటి ఆటంకం లేకుండా విద్యను కొనసాగించేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా నాణ్యమైన న్యాప్కిన్లు పంపిణీ చేస్తుందని తెలిపారు. నాడు-నేడు పథకం క్రింద పాఠశాలల్లో టాయిలెట్ల అభివృద్ధి, నిర్వహణ.. మహిళల రక్షణ, భద్రతకై దిశా యాప్, మహిళా పోలీస్ స్టేషన్లు ఏర్పాటు.. అన్ని రంగాల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు తదితర కార్యక్రమాలను ఏపీ ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యతతో అమలు చేస్తున్నట్లు వివరించారు.ఆంధ్రప్రదేశ్‌లో మహిళల భద్రత, సాధికారత అంశాలు ఆమోఘం: ఆశా మాలవీయఈ సందర్భంగా ఆశా మాలవ్య మాట్లాడుతూ.. తాను మధ్యప్రదేశ్‌లోని రాజ్‌ఘర్ జిల్లా నతారామ్ గ్రామానికి చెందిన జాతీయ క్రీడాకారిణిని అని, సైకిల్‌పై దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో 25,000 కిలోమీటర్లు ప్రయాణించాలనే లక్ష్యంగా పెట్టుకున్నానని, నవంబర్ 1న భోపాల్‌లో సైకిల్ యాత్ర ప్రారంభించి ఇప్పటివరకు ఏపీ సహా 8 రాష్ట్రాల్లో 8 వేలకు పైగా కిలోమీటర్ల మేర సైకిల్ యాత్ర పూర్తి చేయడం జరిగిందని మంత్రికి వివరించారు.తన సైకిల్ యాత్రకు ఆంధ్రప్రదేశ్ లో మంచి ఆదరణ లభించిందని, అటు వంటి ఆదరణ తన సొంత రాష్ట్రమైన మధ్యప్రదేశ్‌లో కూడా లభించలేదని తెలిపారు. రాష్ట్ర గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్‌ను, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మెహన్ రెడ్డిని కలిసినప్పుడు వారు ఎంతగానో తనను ఆదరించారని, రూ.10 లక్షల నగదు ప్రోత్సాహకాన్ని ముఖ్యమంత్రి ప్రకటించడం తనకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని అన్నారు.వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మహిళల భద్రత, సాధికారత సాధనకు అమోఘమైన చర్యలు చేపడుతుందని కొనియాడారు. మహిళల భద్రత కోసం ఏపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన దిశా యాప్ పనితీరు అమోఘంగా ఉందని, ఆ యాప్‌ను తాను కూడా డౌన్ లోడ్ చేసుకుని పరిశీలించడం జరిగిందని, పోలీసుల ప్రతిస్పందన చాలా బాగుందని అన్నారు.



## ఎటుచూసినా శవాల గుట్టలే.. భూకంప మృతులు 11వేలకు పైనే!

అంకారా: తుర్కియే సిరియా ల్లో భారీ భూకంపం సృష్టించిన విలయంతో అక్కడ హృదయవిదారక దృశ్యాలు కొనసాగుతున్నాయి. వేలాదిగా భవనాలు కుప్పకూలి సమాధులను తలపిస్తుండటంతో ఆ శిథిలాల నుంచి మృతదేహాల్ని వెలికి తీసేందుకు సహాయక బృందాలు అహర్నిశలు శ్రమిస్తున్నాయి.ఈ ప్రకృతి విలయంలో మృతుల సంఖ్య రోజురోజుకీ భారీగా పెరుగుతోంది. ఇప్పటికే దాదాపు 11వేల మందికి పైగా మృత్యువాతపడినట్టు అధికారిక గణాంకాలు వెల్లడిస్తున్నాయి. అయితే, గత దశాబ్ద కాలంలో సంభవించిన భూప్రళయాల్లో ఇంత భారీగా మరణాలు నమోదు కావడం ఇదే తొలిసారి కావడం గమనార్హం.ఒక్క తుర్కియేలోనే 8,754మంది ప్రాణాలు కోల్పోయినట్టు ఆ దేశ అధ్యక్షుడు ఎర్డోగాన్ ప్రకటించగా.. సిరియాలో మొత్తంగా 2470 మంది ఈ ప్రకృతి ప్రకోపానికి బలైపోయారు. మొత్తంగా ఇప్పటివరకు 11,224 మంది మృతిచెందారు. మరోవైపు, గాయపడిన వారి సంఖ్య వేల సంఖ్యల్లోనే ఉంది. వేలాదిగా కుప్పకూలిపోయిన భవనాల శిథిలాలను తొలగిస్తుండటంతో ఏ రాయిని కదిపినా దాని కింద ప్రాణంలేని దేహాలే కనబడుతున్న దృశ్యాలు యావత్ ప్రపంచాన్ని కలిచివేస్తున్నాయి. మరోవైపు, శిథిలాల కింద ఊపిరాడక ప్రాణం కోసం పోరాడుతున్న పలువురు చిన్నారుల్ని గుర్తిస్తున్న సహాయక బృందాలు వారిని జాగ్రత్తగా బయటకు తీసి ఆస్పత్రులకు తరలిస్తున్నాయి.

## లోకేశ్ చేతిలో మైక్ లాక్కునేందుకు పోలీసుల యత్నం.. పాదయాత్రలో ఉద్రిక్తత



చిత్తూరు: నారా లోకేశ్ చేపట్టిన 'యువగళం' పాదయాత్రలో స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకుంది. చిత్తూరు జిల్లా ఎన్ఆర్‌పేట ఎన్టీఆర్ కూడలిలో సభ నిర్వహణకు అనుమతి లేదంటూ లోకేశ్‌ను పోలీసులు అడ్డుకున్నారు.జీవో-1 ప్రకారం రోడ్లపై సమావేశానికి అనుమతి లేదని చెప్పడంతో తెదేపా శ్రేణులు ఆగ్రహం వ్యక్త చేశాయి. అనంతరం ఎన్టీఆర్ కూడలిలోనే తనను కలవడానికి వచ్చిన ప్రజల్ని ఉద్దేశించి లోకేశ్ మాట్లాడారు. 'సభ పెట్టుకోవడానికి అనుమతి ఇవ్వకపోతే ఎక్కడ పెట్టాలి. తాడేపల్లి ప్యాలెస్‌లో పెట్టుకోవాలా?' అని పోలీసులను ప్రశ్నించారు. ఈక్రమంలో లోకేశ్ చేతిలో మైకు లాక్కోవడానికి పోలీసులు యత్నించారు. దీంతో పరిస్థితి ఉద్రిక్తతకు దారి తీసింది. లోకేశ్ పాదయాత్రకు పోలీసులు అడుగడుగునా అడ్డుపడుతున్నారని, నిబంధనల పేరుతో వేధిస్తున్నారని తెదేపా కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# సంపాదకీయం

**గురువారం 09-02-2023**

## పొంచి ఉన్న ఆరోగ్య ముప్పు..

వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశాల్లో భారతదేశం ఒకటి. సమీప భవిష్యత్తులో మాత్రం ప్రజల ఆరోగ్యం పై తీవ్ర ప్రభావం కనిపించే అవకాశం ఉందని ఒక అధ్యయనం చెబుతోంది. ప్రజల జీవనశైలిలో వేగంగా కలిగిన మార్పులే కొన్ని అనారోగ్యాలు అధికమవడానికి కారణం అని కూడా ఈ అధ్యయనం తేల్చింది. ఇలా ప్రజలు అధికంగా వ్యాధుల బారిన పడడం దేశ ఆరోగ్య రంగానికే కాదు, మొత్తం సామాజిక ఆర్థిక అభివృద్ధికి కూడా హానికరం. రాబోయే సంవత్సరాలలో భారతీయులను పట్టిపీడించే ముఖ్య వ్యాధులు ఇవే అని ఒక జాబితాను విడుదల చేసింది ఈ అధ్యయనం.ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ప్రకారం సమీప భవిష్యత్తులో భారత దేశంలో క్యాన్సర్ రోగుల సంఖ్య బాగా పెరిగే అవకాశం ఉంది. ప్రతి 10 మంది భారతీయుల్లో ఒకరు ఏదో ఒక క్యాన్సర్ బారిన పడే ఛాన్స్ ఉందని నివేదిక చెబుతోంది. రొమ్ము క్యాన్సర్ ఇప్పటికే గతంతో పోలిస్తే 1.4% నుంచి 2.8% మధ్య పెరిగింది. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లోనే ఈ కేసులు అధికంగా నమోదవుతున్నాయి. క్యాన్సర్ చికిత్స ఖరీదైనది కావడంతో చాలామంది ఆ ఖర్చును భరించలేక నిలిపివేస్తున్నారు. తద్వారా అర్ధాంతరంగా ప్రాణాలను కోల్పోతున్నారు.పిల్లలు కలగకపోవడమే ఇన్‌ఫెర్టిలిటీ. దీన్నే వంధ్యత్వం అని కూడా అంటారు. 2019లో జరిగిన ఒక అధ్యయనంలో దాదాపు 14 శాతం మంది జంటలు పిల్లలు లేక ఒంటరి వారయ్యారు. ఇలా పిల్లలు కలగని జంటలు అధికంగా పట్టణ ప్రాంతాల్లోనే ఉన్నట్టు తెలిసింది. ప్రతి ఆరు జంటల్లో ఒక జంట వంధ్యత్వంతో బాధపడుతున్నారు. రాబోయే సంవత్సరాల్లో ఈ సంఖ్య పది శాతం పెరిగే అవకాశం ఉందని నివేదిక చెబుతోంది. జీవనశైలి, పర్యావరణపరంగా పెరిగిన టాక్సిన్స్ కారణంగా ఇలా పిల్లలు పుట్టడం కష్టతరం అవుతుందని అధ్యయనం అంచనా వేస్తోంది.పుట్టే పిల్లల్లో కొన్ని రకాల వైకల్యాలు, అసాధారణతలు వచ్చే అవకాశం రాబోయే సంవత్సరాల్లో పెరుగుతుంది. దీనివల్ల మరణాలు పెరిగిపోయే అవకాశం ఉంది. ఈ అసాధారణతలు, వైకల్యాలు జన్యుపరంగా కూడా వస్తాయని అంచనా. అలాగే మారిన పర్యావరణం వల్ల, విషపూరిత మూలకాల వల్ల కూడా పిల్లలు ఇలా అసాధారణంగా వైకల్యంతో జన్మించే అవకాశాలు ఉన్నాయి.పదిహేడు లక్షల మంది భారతీయులు కంటి చూపును కోల్పోవడానికి ప్రధాన కారణం కంటి శుక్లాలు. కొందరు వృద్ధాప్యం కారణంగా ఈ వ్యాధి బారిన పడితే, కొంతమంది గాయాల కారణంగా కంటి శుక్లాలు బారిన పడుతున్నారు. అలాగే కంటి లెన్స్ ను తయారు చేసే కణజాలాన్ని మార్చినప్పుడు కూడా ఈ సమస్య మొదలవుతుంది. లెన్స్ లోని ప్రోటీన్లు, ఫైబర్లు విచ్ఛిన్నం కావడం వల్ల దృష్టి మసకగా మారుతుంది. అలాగే ఇది జన్యుపరంగా వచ్చే అవకాశం కూడా ఉంది. మధుమేహం వంటి వైద్య పరిస్థితిలో కూడా కంటి శుక్లాలు రావడానికి కారణం అని చెప్పుకోవచ్చు. ప్రపంచంలో ఎక్కువ శాతం మంది ఇబ్బంది పడుతున్న సమస్య మధుమేహం. దాదాపు 75 మిలియన్ల మంది అంటే ఏడున్నర కోట్లకు పైగా జనాభా మధుమేహ వ్యాధిగ్రస్తులు. అదే మన దేశం విషయానికి వస్తే ప్రతి ఆరుగురిలో ఒకరు మధుమేహంతో బాధపడుతున్నట్టు తేలింది. ఇక్కడ ఈ సమస్య కూడా పట్టణ ప్రాంతాల్లోనే అధికంగా ఉంది. మధుమేహం అదుపులో ఉండకపోతే గుండె, మూత్రపిండాల సమస్యలకు దారితీస్తుంది.వ్యాయామం లేకపోవడం, అనారోగ్యకరమైన ఆహారాలు తినడం వంటి కారణాల వల్ల ఎంతోమంది హృదయ సంబంధ వ్యాధుల బారిన పడుతున్నారు. దాదాపు 55 మిలియన్ల మంది భారతీయులు ఇలా గుండె సంబంధ వ్యాధులతో ఇబ్బంది పడుతున్నారు. ఈ సంఖ్య భవిష్యత్తులో పెరిగే అవకాశం ఉంది.ఊబకాయం బారిన పడుతున్న వారిలో ఎక్కువగా పట్టణంలో ఉంటున్న వారే. ఇది జీవనశైలి కారణంగా వస్తున్నది. శారీరక శ్రమ లేకపోవడం, జంక్ ఫుడ్, ఫాస్ట్ ఫుడ్ అధికంగా తినడం వల్ల ఉబకాయుల సంఖ్య పెరిగిపోతోంది. 2030 నాటికి ప్రపంచంలోనే ఊబకాయం ఉన్న పిల్లల్లో భారత్ రెండో స్థానానికి చేరుకుంటుందని నివేదికలు చెబుతున్నాయి.ఒకప్పుడు జుట్టు ఊడటం అనేది వంశపారంపర్యంగా వచ్చేది. అంటే బట్టతల కేవలం జన్యుపరంగానే వచ్చేది, కానీ భవిష్యత్తులో కేవలం 20 ఏళ్ల వయసులోనే పురుషులకు బట్ట తల రావడం మొదలయ్యే అవకాశం ఉంది. దీనికి కారణం అనారోగ్యకరమైన లైఫ్ స్టైల్ అని చెప్పాలి. అలాగే తీవ్రమైన మానసిక ప్రభావం కూడా జుట్టు ఊడిపోవడానికి కారణం అవుతుంది.

# శత్రువులు మిత్రులవుతున్నారు...

నెల్లూరు, ఫిబ్రవరి 8,నెల్లూరు జిల్లాలో రాజకీయాలు శరవేగంగా మారిపోతున్నాయి. మిత్రులు అనుకున్నవారు కాస్తా శత్రువులుగా మారిపోతున్నారు. శత్రువులు అనుకున్నవారు మిత్రులు అయిపోతున్నారు. తాజాగా కోటంరెడ్డి ఉదంతం తర్వాత నెల్లూరు జిల్లా రాజకీయాల్ల ఈ మార్పులన్నీ స్పష్టమవుతున్నాయి.అప్పట్లో కాకాణి గోవర్దన్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్ మధ్య ఎంత గొడవ జరిగిందో అందరికీ తెలుసు. కాకాణి గోవర్దన్ రెడ్డికి మంత్రి పదవి వచ్చిన తర్వాత నెల్లూరు నగరంలో ఆనం రామనారాయణ రెడ్డి ఆయనకు స్వాగతం పలుకుతూ భారీగా ఫ్లెక్సీలు వేశారు. ఆ ఫ్లెక్సీలను అనిల్ వర్గం చించేసిందనే ఆరోపణలున్నాయి. అదే రోజు ఎమ్మెల్యే అనిల్ నెల్లూరు నగరంలో సభ పెట్టడంతో.. కాకాణి విజయోత్సవాలను అడ్డుకోవడానికే ఈ ఏర్పాటు అనుకున్నారంతా. కట్ చేస్తే ఆ ఇద్దరినీ సీఎం జగన్ పిలిపించుకుని మాట్లాడారు. ఆ తర్వాత కూడా వారు పెద్దగా సఖ్యతగా లేరు అనేది బహిరంగ రహస్యమే. కానీ ఇప్పుడు సీన్ రివర్స్ అయింది. కాకాణికి స్వాగత సత్కారాలు చేసిన ఆనం ఇప్పుడు పరాయి మనిషి అయ్యారు. కాకాణికి అనిల్ ఇప్పుడు మంచి మిత్రుడయ్యారు.అప్పట్లో అనిల్ కి మంత్రి పదవి వచ్చిన సందర్భంలో ఇతర నాయకులెవరూ పెద్దగా స్పందించకపోయినా ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి అనిల్ కి ఘన స్వాగతం పలికారు. అప్పట్లో అనిల్, కోటంరెడ్డి మంచి దోస్తులు. కానీ ఇప్పుడు శత్రువులయ్యారు. అప్పట్లో అనిల్ ని వ్యతిరేకించిన కాకాణి ఆయనకు ఇప్పుడు స్నేహితుడిగా మారారు. కాకాణిని సపోర్ట్ చేసిన కోటంరెడ్డి, ఆనం.. ఇద్దరూ ఇప్పుడు కాకాణికి శత్రువులు కావడం విశేషం.ప్రస్తుతం ఆనం, కోటంరెడ్డి ఇద్దరూ వైసీపీ రెబల్స్. దాదాపుగా వీరిద్దరూ టీడీపీలోకి వెళ్తారనే ఆలోచనలో ఉన్నారు. అంటే టీడీపీలోకి వెళ్లినా, ప్రస్తుతానికి వెళ్లకపోయినా వీరిద్దరి మధ్య శతృత్వం లేదు. కానీ గతంలో కోటంరెడ్డి వర్గానికి ఆనం వర్గానికి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేది. అప్పట్లో శత్రువులుగా ఉన్న వీరిద్దరూ ఇప్పుడు ట్యాపింగ్ వ్యవహారంతో మిత్రులుగా మారడం విశేషం.2019 ఎన్నికల్లో టీడీపీ బీ ఫామ్ కూడా తీసుకుని ఆ తర్వాత చివరి నిమిషంలో ఆదాల ప్రభాకర్ రెడ్డి వైసీపీలోకి జంప్ చేశారు. నెల్లూరు ఎంపీగా గెలిచారు. కానీ ఆయనకు స్థానిక నాయకులతో పెద్దగా అనుబంధం లేదు. ఆయన అంటీముట్టనట్టుగానే ఉండేవారు. అలాంటి ఆదాల ఇప్పుడు స్థానిక నాయకులకు గొప్ప మిత్రుడు అయ్యారు. ఆదాల ఇంటికి అనిల్ వస్తున్నారు. కార్పొరేటర్ల వ్యవహారాలన్నీ ఆయనే చక్కబెడుతున్నారు.నిన్న మొన్నటి వరకూ నెల్లూరు జిల్లాలో అందరూ వైసీపీయే అయినా అందరి మధ్య విభేదాలు ఉండేవి. కానీ ఆనం, కోటంరెడ్డి ఎపిసోడ్ తర్వాత వారిద్దరు మినహా మిగతా వారంతా ఒక్కటి అయ్యారు. ఒకే తాటిపైకి వచ్చారు. ఆదాల వైపు నిలపడ్డారు. ఆదాల గెలుపు కోసం కృషి చేస్తామంటున్నారు. తమలో ఉన్న విభేదాలను కూడా వారు పక్కనపెట్టినట్టే తెలుస్తోంది. మొత్తమ్మీద ఆనం, కోటంరెడ్డి ఎపిసోడ్ తర్వాత నెల్లూరు జిల్లాలో మిత్రులెవరో, శత్రువులెవరో కొత్తగా తేల్చుకోవాల్సిన పరిస్థితి.

# ఉగాది తర్వాత జగన్ బస్సు యాత్ర



విజయవాడ, ఫిబ్రవరి 8, అధికార పార్టీ నేతలకు ఎప్పుడూ ఓ సమస్య వేధిస్తూ ఉంటుంది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ద్వితీయ శ్రేణి నేతలతోనూ నేరుగా టచ్ లో ఉంటారు. కానీ అధికారంలోకి వచ్చాక అధికార బాధ్యతలతో పార్టీపై, క్యాడర్ పై దృష్టి పెట్టలేరు. ఫలితంగా వారు దూరమవుతారు. ఇలాంటి సమస్య వైఎస్ఆర్‌సీపీని వెంటాడుతోంది. ఎన్నికలు దగ్గరకు వస్తున్న సమయంలో ఇలాంటి పరిస్థితిని మార్చి మళ్లీ ద్వితీయ శ్రేణి నేతల్ని పూర్తి స్థాయిలో యాక్టివ్ చేసేందుకు సీఎం జగన్ రకరకాల ప్రయత్నాలు చేస్తున్నారు. ఇటీవల గృహసారథుల్ని నియమించాలని ఆదేశించారు. ఇప్పుడు జిల్లాల పర్యటనలకు వెళ్లినప్పుడు ప్రత్యేకంగా ద్వితీయ శ్రేణి నేతలతో మాట్లాడాలని అనుకుంటున్నారు. వైఎస్ఆర్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత తమను పట్టించుకోలేదన్న భావన ఆ పార్టీ క్యాడర్ లో ఎక్కువ ఉంది. వాలంటీర్లను నియమించి.. అన్ని బాధ్యతలు వారికే ఇచ్చారు. దీంతో వైసీపీ ద్వితీయ శ్రేణి నేతలకు తమ పార్టీ అధికారంలోకి వచ్చిందన్న ఆనందం లేకుండా పోయింది. అదే సమయంలో సీఎం జగన్ .. ద్వితీయ శ్రేణి నాయకత్వానికి చాలా దూరంగా వెళ్లారు. ఇప్పటి వరకూ మంత్రులు, ఎమ్మెల్యేలు మాత్రమే పార్టీ అధిష్టానంతో నిత్యం టచ్‌లో ఉంటారు. ఆయా నియోజకవర్గాల పరిధిలో సెకండ్ కేడర్ నాయకులంతా మంత్రులు, ఎమ్మెల్యేలకు అనుచరులుగానే ఉండిపోతున్నారు. వారికి ఏదైనా రాజకీయంగా ఇబ్బంది వస్తే స్థానికంగా ఉన్న శాసనభ్యులపైనే ఆధారపడాల్సి వస్తోంది. అదిష్టాన పెద్దలను నేరుగా కలిసి వారి సమస్యను చెప్పుకునే పరిస్థితి లేదు. ఇక నుండి ఆ తరహా ఇబ్బందులను పరిష్కరించి.. పార్టీపై నమ్మకం పెంచేందుకు సీఎం జగన్ వారితో సమావేశం అవ్వాలనుకుంటున్నారు. నియోజకవర్గాల సమీక్షలు చేస్తున్నప్పుడు ఒక్కో నియోజకవర్గం నుంచి యాభై మంది ద్వితీయ శ్రేణి నేతల్ని తాడేపల్లి క్యాంప్ ఆఫీస్ కు పిలిపిస్తున్నారు. అయితే అవి తరచుగా జరగడం లేదు. అందుకే సీఎం జగన్ జిల్లా పర్యటనకు వెళ్లే సందర్భంలో స్థానిక శాససభ్యులతోపాటు నియోజకవర్గ పరిధిలోని ముఖ్యమైన ద్వితీయ స్థాయి నాయకులకు కూడా ఆ సమావేశంలో పాల్గొనేందుకు ఆహ్వానించాలని నిర్ణయించారు. నియోజకవర్గ స్థాయిలో వారి సమస్యలను కూడా తెలుసుకుని ఎక్కడిక్కడే పరిష్కరించేలా ఏర్పాట్లు చేయాలనుకుంటున్నారు. ఎమ్మెల్యేలు పార్టీ మారితే వారంతా ఆ ఎమ్మెల్యేతో వెళ్లిపోతున్నారు. దీన్ని నిలువరించడానికైనా.. .ద్వితీయ శ్రేణి నేతలకు తామున్నామనే భరోసా ఇవ్వాలని అనుకుంటున్నట్లుగా తెలుస్తోంది. నెల్లూరులో పార్టీ పరిస్థితులతో వైసీపీ హైకమాండ్‌కు పరిస్థితి అర్థమయింది. నెల్లూరులో టీడీపీకి ఒక్క కార్పొరేటర్ కూడా లేరు. అందరూ వైఎస్ఆర్‌సీపీకి చెందిన వారే. కానీ ఇప్పుడు మేయర్ కూడా తాను వైఎస్ఆర్‌సీపీ కాదని.. కోటంరెడ్డి పార్టీ అంటున్నారు. ఇది హైకమాండ్‌ను ఆశ్చర్య పరుస్తోంది. ఆయా నేతలకు కోటంరెడ్డి తప్ప ఇతర పెద్ద నేతలవరూ పరిచయం లేదని.. కనీసం నెల్లూరు జిల్లా మంత్రి కూడా వారిని కలవలేదని తేలింది. దీంతో అలాంటి గ్యాప్ ఉంటే ఎప్పటికైనా నష్టమేనని భావించి ఇక నుంచి సందర్భం వచ్చినప్పుడల్లా ద్వితీయ శ్రేణి నేతలతో సమావేశం కావడం, పార్టీలో వారికి మరింత ప్రాధాన్యతను పెంచాలని సీఎం జగన్ నిర్ణయం తీసుకున్నట్లు చెబుతున్నారు.

# అమలాపురానికి కొత్త క్యాండిడేట్

కాకినాడ, ఫిబ్రవరి 8, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆమలాపురం పార్లమెంట్ నియోజకవర్గానికి ఒక ప్రత్యేకత ఉంది. దివంగత లోక్ సభ స్పీకర్ జీఎంసీ బాలయోగి ఈ నియోజకవర్గం నుంచే ప్రాతినిధ్యం వహించారు. అనేక మంది నాయకులు తమ మార్కు రాజకీయంతో ప్రజల మన్ననలు పొందారు. అలాంటి అమలాపురం పార్లమెంటు నియోజకవర్గం స్థానిక ప్రజలకు మరో కొత్త నాయకుని పరిచయం చేయబోతుందా? 2014 నాటి పరిస్థితులు మళ్లీ తెరపైకి రానున్నాయా అనే సందేహం కలుగుతుంది. 2014లో అప్పటి వరకు మొఖం తెలియని ఐఆర్ఎస్ ఉన్నతాధికారి పండుల రవీంద్రబాబు ఒక్కసారిగా తెరపైకొచ్చి తెలుగుదేశం పార్టీ తరఫున విజయం సాధించారు. అనంతరం 2019లో అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గం నుంచి లోక్ సభ స్పీకర్ బాలయోగి కుమారుడు హరీష్ బాలయోగి పోటీ చేశారు. ఈయన ఎంపీ చింత అనురాధపై ఓటమి పాలయ్యారు. అయితే అప్పటి నుంచి అధిష్టానం నిర్ణయం మేరకు హరీష్ బాలయోగి నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో ప్రతిపక్ష నేతగా పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నారు.ఇటీవల తెలుగుదేశం పార్టీ అధిష్టానం హరీష్ బాలయోగిని పీ గన్నవరం నియోజకవర్గ ఇన్చార్జిగా నియమించింది. పీగన్నవరం నియోజకవర్గానికి పలుమార్లు ప్రాతినిధ్యం వహించిన పులపర్తి నారాయణమూర్తి మృతి చెందటంతో అక్కడ టీడీపీకి బలమైన అభ్యర్థులు లేకుండాపోయారు. పీ గన్నవరంలో పార్టీకి బలమైన ఓటు బ్యాంకు ఉన్నప్పటికీ బలమైన నాయకత్వం లేక అంతంతమాత్రమే ఉంది. అయితే వైసీపీ ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబుపై స్థానిక ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. నియోజకవర్గం పరిధిలో అభివృద్ధి పనులు జరగకపోవడంతోపాటు పార్టీ కార్యకర్తలకు అందుబాటులో లేకపోవడం, సరైన సత్సంబంధాలు కొనసాగించడం లేదనే విమర్శలు ఉన్నాయి. గడపగడపకూ కార్యక్రమంతో పాటు పలుమార్లు నియోజకవర్గంలో పర్యటించిన ఎమ్మెల్యే చిట్టిబాబుపై అక్కడి ప్రజలు బాహాటంగానే వ్యతిరేకత వ్యక్తం చేశారు. ఇటువంటి పరిస్థితుల్లో పీ గన్నవరంలో టీడీపీ నుంచి మంచి అభ్యర్థిని నిలిపితే గెలుపు తథ్యమని భావించి హరీష్ బాలయోగిని అక్కడకు పంపినట్లు తెలిసింది అమలాపురం పార్లమెంట్ బరిలో ఎవరు ఉంటారనే అనుమానాలు జోరుగా సాగుతున్నాయి. పీ గన్నవరం నియోజకవర్గంలో హరీష్ బాలయోగికి టికెట్ ఇస్తే అమలాపురం పార్లమెంట్ స్థానానికి ఎవరు పోటీ చేస్తారని చర్చలు నడుస్తున్నాయి. ఎన్నికల సమీపించే వరకు అభ్యర్థులు ఎవరనేది బయటకు తెలియనివ్వకుండా టీడీపీ అధిష్టానం జాగ్రత్త పడుతున్నట్టు తెలుస్తోంది. అయితే ముమ్మిడివరం నియోజకవర్గానికి చెందిన మోక విద్యాసాగర్ అమలాపురం పార్లమెంట్ స్థానానికి ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ఇదే కనుక నిజమైతే అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గానికి మరో కొత్త అభ్యర్థి పరిచయమైనట్టే. అయితే ఇప్పటి వరకు అమలాపురం పార్లమెంట్ స్థానానికి హరీష్ బాలయోగి అభ్యర్థిగా భావిస్తున్న పార్టీ క్యాడర్ తాజా మార్పునకు ఎలా స్పందిస్తారనేది వేచి చూడాలి.

# కాకినాడలో తల్లి పాల బ్యాంక్

కాకినాడ, ఫిబ్రవరి 8,తల్లి పాల దానం చేయవచ్చు. తల్లి పాలు దానం చేయడమేమిటని ఆశ్చర్యపోతున్నారా! ఔను.. తల్లి పాలను సైతం ఇకనుంచి దానం చేయొచ్చు. తల్లి పాలకు దూరమైన బిడ్డలకు ప్రాణ భిక్ష, ఆరోగ్య భిక్ష కల్పించవచ్చు. రక్తదానం మాదిరిగా అమ్మ పాలను దానంగా స్వీకరించి నిల్వ చేసేందుకు రాష్ట్రంలోనే తొలిసారిగా కాకినాడలో 'మదర్ మిల్క్ బ్యాంక్' సిద్ధమవుతోంది. ప్రభుత్వ సామాన్య ఆస్పత్రి (జీజీహెచ్) పీడియాట్రిక్ విభాగం పైఅంతస్తులో 8 గదులతో ప్రత్యేక బ్లాక్ ఏర్పాటు చేస్తున్నారు.రాష్ట్ర ప్రభుత్వం, హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న 'సుశేణ హెల్త్ ఫౌండేషన్' మధ్య ఇందుకు సంబంధించి ఇటీవల ఒప్పందం కుదిరింది. ఆ సంస్థ ఫౌండర్ డైరెక్టర్ డాక్టర్ సంతోష్‌కుమార్ దేశంలోనే 8వ మదర్ మిల్క్ బ్యాంక్‌ను ఈ నెల 13న ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఫౌండేషన్ రూ.కోటితో మూడు విడతల్లో దీని నిర్మాణం చేపడుతోంది.తల్లి పాలు బిడ్డ ఎదుగుదల, సంపూర్ణ ఆరోగ్యానికి ఎంతో కీలకం. వీటి ప్రాధాన్యత తెలియకపోవడం వల్ల కొందరు.. శరీరాకృతి మారిపోతుందనే అపోహతో మరికొందరు.. తల్లి పాలు రాక ఇంకొందరు పిల్లలు చనుబాలకు దూరమవుతున్నారు. ప్రత్యామ్నాయంగా పోత పాలతో బిడ్డ ఆకలి తీరుస్తుండటం వల్ల బిడ్డల ఆరోగ్యం దెబ్బతింటోంది. ఆరోగ్యాన్ని పరోక్షంగా దెబ్బ తీస్తున్నాయి. రాష్ట్రంలోని ప్రభుత్వాస్పత్రుల్లో ఎక్కువగా ప్రసవాలు జరిగే టాప్?5లో ఉన్న కాకినాడ జీజీహెచ్‌ను 'సుశేణ' హెల్త్ ఫౌండేషన్ ఎంపిక చేసుకుంది. నవజాత శిశువు నుంచి రెండేళ్ల బిడ్డ వరకు ఈ బ్యాంక్‌లో పాలు ఇస్తారు. తల్లి బిడ్డకు ఇవ్వగా మిగులు పాలను సేకరించి అవసరమైన పిల్లలకు అందిస్తారు. హెచ్ఐవీ, వీడీఆర్ఎల్ (వెనెరియల్ డిసీజ్ రీసెర్చ్ లేబొరేటరీ టెస్ట్), హెపటైటిస్ పరీక్షల్లో నెగిటివ్ వస్తేనే తల్లి పాలు తీసుకుంటారు. కాగా, ఇక్కడ తల్లుల చనుబాల పరిమాణం పెంచేందుకు అనుసరించాల్సిన శాస్త్రీయ విధానాలపై అవగాహన కల్పిస్తారు.మసాజ్ థెరఫీ, న్యూట్రిషనల్ ట్రీట్‌మెంట్ (పోషకాలతో కూడిన వైద్యం), మదర్‌కేర్ (బిడ్డను హత్తుకుని పాలిచ్చే) తరహాలో తల్లులకు బిడ్డలను కనీసం గంటపాటు హత్తుకుని ఉండేటట్టు ఈ బ్యాంక్‌లోని ప్రత్యేక వార్డులో నిపుణుల పర్యవేక్షణలో ఉంచుతారు. ఇలా ఈ బ్యాంక్‌లో రెండు, మూడు రోజులు ఉంచి తల్లులకు అవగాహన వచ్చాక ఇంటి వద్ద ఇదే విధానాన్ని అనుసరించాలని సూచించి పంపేస్తారు. స్వచ్ఛంద దాతలు జీజీహెచ్ మిల్క్ బ్యాంక్‌కు వచ్చి పాలు దానం చేయవచ్చు.ఈ మొత్తం ప్రక్రియ పూర్తిగా ఉచితం. తొలి దశలో సేకరించిన పాలను నిల్వ చేయకుండా వెంటనే అవసరమైన శిశువులకు పట్టిస్తారు. రెండో దశలో పాలను నిల్వ చేస్తారు. కనీసం 6 నెలల నుంచి గరిష్టంగా ఏడాది పాటు వాటిని పాడవకుండా భద్రపరుస్తారు. ఇందుకు ప్రత్యేక యంత్రాలు జీజీహెచ్‌లో సిద్ధమయ్యాయి.

# పాపం.. ఆనం బ్రదర్స్





నెల్లూరు, ఫిబ్రవరి 8, తెలుగుదేశం పార్టీలో టిక్కెట్ల సందడి మొదలయింది. జనసేనతో పొత్తు ఉంటుందని తేలడంతో ఇప్పటి నుంచే నేతలు నియోజకవర్గాల్లో పట్టు పెంచుకునేందుకు రెడీ అయిపోతున్నారు. చంద్రబాబు వార్నింగ్‌లతో నేతలు నియోజకవర్గంలో మకాం వేసి కార్యకర్తలకు అందుబాటులో ఉండే ప్రయత్నం చేస్తున్నారు. అయితే నెల్లూరు జిల్లాలో తెలుగుదేశం పార్టీ బలహీనంగా ఉంది. నెల్లూరు జిల్లాలో పది నియోజకవర్గాలను వైసీపీ క్లీన్ స్వీప్ చేసింది. తెలుగుదేశం పార్టీ 2004 నుంచి నెల్లూరు జిల్లాలో వీక్ గా ఉంది. సీనియర్ నేతలున్నా పార్టీ ఎదగడం ఇక్కడ కష్టంగా మారింది. 2014లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చినా చివరకు ఇద్దరు ఎమ్మెల్సీలను చేసి మంత్రి పదవులను ఇవ్వాల్సి వచ్చింది. పొంగూరు నారాయణ, సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డిలను ఎమ్మెల్సీలను చేసి మంత్రులను చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే ఇప్పుడు నెల్లూరు పట్టణ నియోజకవర్గంలో టీడీపీ బలంగా లేదు. నియోజకవర్గం ఆవిర్భవించిన తర్వాత ఇక్కడ టీడీపీకి గెలుపు పిలుపు వినిపించలేదు. గత ఎన్నికల్లో అప్పట్లో మున్సిపల్ మంత్రిగా నారాయణ ఉండి మరీ పోటీ చేశారు. నెల్లూరు నగరానికి కోట్ల రూపాయలు కేటాయించి, ప్రారంభోత్సవాలు చేసి, హడావిడి చేసినా ఫలితం లేకుండా పోయింది... ఇప్పుడు నారాయణ రాజకీయాల నుంచి తప్పుకున్నట్లే కనపడుతుంది. ఆయన పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. పూర్తిగా తన వ్యాపారాలపై దృష్టి పెట్టారు. దీంతో వచ్చే ఎన్నికల్లో నెల్లూరు పట్టణ నియోజకవర్గం నుంచి ఎవరు టీడీపీ నుంచి పోటీ చేస్తారన్న దానిపై చర్చ జరుగుతుంది. ఇక్కడ జనసేన కూడా బలంగా ఉంది. అయితే కార్పొరేషన్ ఎన్నికల్లో పెద్దగా ఫలితం కన్పించ లేదు. జనసేనతో టీడీపీ పొత్తు ఉంటే పొత్తులో భాగంగా నెల్లూరు పట్టణ నియోజకవర్గాన్ని కోరుకునే వీలుంది. కానీ ఇక్కడ ఆనం కుటుంబం ఆశలు పెట్టుకుంది. నెల్లూరు రూరల్ నియోజకవర్గమైనా పరవాలేదని ఆయన చెబుతున్నారు. అయితే నెల్లూరు మాజీ మేయర్ అబ్దుల్ అజీజ్ ను ఏం చేస్తారన్నది ఆసక్తికరంగా మారింది. ఒకవేళ జనసేనతో పొత్తు కుదిరితే ఆ సీటును జనసేన కోరే అవకాశముంది. ఇది మొన్నటి వరకూ జరిగిన చర్చ. ఇప్పుడు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ఎంట్రీతో ఆనం వెంకట రమణారెడ్డి ఆశలు అడియాసలే అయ్యాయి. నెల్లూరు పట్టణ నియోజకవర్గంలో ఆనం కుటుంబానికి పట్టుంది. అలాగే రూరల్ నియోజకవర్గంలోనూ కొంత బలముంది. ప్రస్తుతం ఆనం వెంకటరమణారెడ్డి ఈ రెండు స్థానాల్లో పోటీ చేయడానికి రెడీ అవుతున్నారు. అందుకే ఆయన పార్టీలో యాక్టివ్ గా ఉన్నారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గం నుంచి 2009లో ఆనం వివేకానందరెడ్డి కాంగ్రెస్ నుంచి గెలిచారు. ఇక రూరల్ నియోజకవర్గంలోనూ బలముండటంతో రెండింటిలో ఒక సీటు తనకు కావాలని ఆనం వెంకటరమణారెడ్డి కోరినట్లు సమాచారం. చంద్రబాబు కూడా అందుకు మొగ్గు చూపినట్లు తెలుస్తోంది. నెల్లూరు రూరల్ నుంచి కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి టీడీపీ నుంచి ఈసారి పోటీ చేస్తానని చెప్పేశారు. ఆయన అక్కడి నుంచి బరిలోకి దిగితే ఆనం వెంకటరమణారెడ్డి నెల్లూరు టౌన్ నుంచి బరిలోకి దిగే అవకాశముందంటున్నారు. మరి జనసేన, బీజేపీలతో పొత్తు ఉంటే మాత్రం ఆనం కు సీటు గల్లంతేనని చెప్పక తప్పదు. చివరికి ఆనంకు ఆయాసం తప్ప మిగిలేదేమీ లేదంటున్నారు.

# తిరుపతి రైల్వేస్టేషన్ కు మహర్దశ


తిరుపతి, ఫిబ్రవరి 8,రానున్న 40 ఏళ్లపాటు రైలు ప్రయాణికుల అవసరాలను తీర్చేందుకు తిరుపతి రైల్వేస్టేషన్ అప్‌గ్రేడేషన్ పనులు శరవేగంగా సాగుతున్నాయని, రెండేళ్లలో పూర్తి చేయాలని నిర్ణయించారు. 2022 మేలో అప్‌గ్రేడేషన్ పనులను ప్రారంభించిన దక్షిణ మధ్య రైల్వే.. ప్రాజెక్ట్ సకాలంలో పూర్తయ్యేలా అన్ని స్థాయిలలో పనిని పర్యవేక్షిస్తున్నట్లు మంగళవారం తెలిపింది. ఈ పని ఈపీసీ మోడ్‌లో ఇవ్వబడింది. మొత్తం ప్రాజెక్ట్ ఫిబ్రవరి, 2025 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.ప్రస్తుతం ఉన్న స్టేషన్ భవనానికి దక్షిణం వైపున కొత్త స్టేషన్ భవనం రాబోతోంది. జియోలాజికల్ సర్వే పూర్తయిన తర్వాత క్యాంపు కార్యాలయం, కాంక్రీట్ ల్యాబ్, స్టోరేజీ షెడ్ల ఏర్పాటు, మిగిలిన పనులు వేగంగా కొనసాగుతున్నాయి. కొత్తగా నిర్మించనున్న స్టేషన్ భవనానికి 100 శాతం పునాదుల శంకుస్థాపన పూర్తయింది. ఇప్పటి వరకు, ఫౌండేషన్‌లు, బేస్‌మెంట్ ఫ్లోర్ యొక్క స్తంభాలు, రిటైనింగ్ వాల్‌లో సుమారు 7,450 క్యూబిక్ మీటర్ల కాంక్రీటును ఉపయోగించారు. తదుపరి దశలో, బేస్‌మెంట్ ఫ్లోర్ కోసం కాంక్రీట్ స్లాబ్‌ను సెంట్రింగ్, షట్టరింగ్‌కు సంబంధించిన పనులు ప్రారంభమయ్యాయని, వేగంగా పురోగమిస్తున్నాయని ఎస్‌సీఆర్ తెలిపింది. ఇప్పటి వరకు దాదాపు 20 శాతం పనులు పూర్తయ్యాయికొత్త స్టేషన్ బిల్డింగ్‌లో భాగంగా భారీగా నీటిని నిల్వచేసే సామర్థ్యంతో అండర్ గ్రౌండ్ వాటర్ ట్యాంక్ రానుంది. దీని కోసం, భూగర్భ ట్యాంకు నిర్మాణంతో పాటు దాని పునాదుల శంకుస్థాపన కోసం రెండు తవ్వకం పనులు కూడా పూర్తయ్యాయి.అప్‌గ్రేడ్ చేసిన స్టేషన్‌లో భాగంగా ఇన్‌కమింగ్, అవుట్‌గోయింగ్ ప్యాసింజర్‌లను హ్యాండిల్ చేయడానికి రెండు కొత్త ఎయిర్‌కోర్సులను నిర్మించాలని యోచిస్తున్నారు. ఈ ఎయిర్‌కోర్స్‌లు 35 మీటర్ల వెడల్పుతో ఉంటాయి. స్టేషన్‌లోని అన్ని ప్లాట్‌ఫారమ్‌లను. స్టేషన్ భవనాలకు రెండు వైపులా (ఉత్తరం, దక్షిణం) కలుపుతాయి. తిరుపతి స్టేషన్ అప్‌గ్రేడేషన్ పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని, దీంతో పనులకు ఆటంకం కలగకుండా, నిర్ణీత గడువులోగా పూర్తి చేస్తామని ఎస్‌సిఆర్ జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ తెలిపారు. స్టేషన్‌లో ప్రయాణికులకు, రైళ్ల రాకపోకలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అత్యంత జాగ్రత్తగా పనులు చేపడుతున్నట్లు తెలిపారు.

# ఏపీలో ముందస్తు ఖాయమేనా

విజయవాడ, ఫిబ్రవరి 8,ఆంధ్రప్రదేశ్ లో వైసీపీ సర్కార్ పరిస్థితి ముందు చూస్తే గొయ్యి, వెనుక చూస్తే నుయ్యి అన్నట్లుగా తయారైంది. ఎన్నికలకు ఇంకా ఏడాది పైగా సమయమున్నా.. జగన్ సర్కార్ ఇప్పుడో.. ఇహనో అసెంబ్లీ రద్దు చేసి ముందస్తుకు వెళ్లాలని నిర్ణయం తీసేసుకుందా అన్నట్లుగా ప్రభుత్వ నిర్ణయాలు ఉన్నాయి. అదే సమయంలో ముందస్తుకు వెళితే కొండ నాలుక్కి మందు వేస్తే ఉన్న నాలుక కూడా ఊడినట్లు అన్న చందంగా ముందుగానే అధికారం కోల్పోవలసి వస్తుందా అన్న సందేహమూ వైసీపీ ప్రభుత్వాన్నీ, పార్టీ ముఖ్యులనూ వెంటాడుతోంది. ఇప్పుడు జగన్ ప్రభుత్వం కూడా సరిగ్గా అటువంటి సంకట స్థితినే ఎదుర్కొంటోంది. ముందస్తుకు వెళ్లకుంటే ఇప్పటికే దిగజారిన ప్రభుత్వ ప్రతిష్ట మరో ఏడాది కాలంలో అధమ స్థాయికి పడిపోయేలా ఉంది. అలాగని ముందస్తుకే వెళితే.. ఏప్పుడో ఏడాది తరువాత చేజారాల్సిన అధికారం అంతకంటే ముందే చేయి జారిపోతుంది. ఇప్పుడు ఏపీ సర్కార్ పరిస్థితి సరిగ్గా అలాగే ఉంది. ముందస్తుకు వెళ్లుటయా? మానుటయా అన్న సందిగ్ధంతో పడి కొట్టుమిట్టాడుతోంది. ఒక వైపు ముందస్తుకు రెడీ అయిపోతూనే.. మరో వైపు వేచి చేద్దాం అన్నట్లుగా వ్యవమరిస్తోంది. అందుకే చూస్తే కదులుతున్న అధికార పీఠం.. ఇటు చూస్తే కమ్ముకొస్తున్న ప్రజా వ్యతిరేకత.. అసెంబ్లీ రద్దు చేసి ముందస్తుకు వెళ్లడమా? వ్యతిరేకతను పట్టించుకోకుండా అధికారాన్నిపట్టుకు వేలాడుతూ మిగిలిన ఏడాది గడిపేయడమా? అన్నది జగన్ సర్కార్ కు ఎటూ తేల్చుకోలేని సందిగ్ధ పరిస్థితిని తీసుకు వచ్చింది. సరిగ్గా అదే సమయంలో మండల, డివిజన్ స్థాయిలో ఉన్న ఖాళీలన్నిటినీ వెంటనే భర్తీ చేయాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశిస్తూ.. సీఎంవో కార్యాలయం నుంచి ఆదేశాలుజారీ అయ్యాయి. దీంతో జగన్ ముందస్తుకే మొగ్గు చూపుతున్నారని అంతా భావిస్తున్నారు. నిజానికి ముందస్తుకు వెళ్లినా, షెడ్యూల్ ప్రకారమే ఎన్నికలు జరిగినా ఓటమి తథ్యమన్న భావనకు ఇప్పటికే వైసీపీ నేతలు వచ్చేశారనీ, అందుకే.. ముందస్తుకు వెళ్లడమా? షెడ్యూల్ ప్రకారం ఎన్నికలు వచ్చే వరకూ ఆగటమా? అన్న సంశయంలో పడ్డారనీ అంటున్నారు. మరో ఏడాదిన్నర ప్రభుత్వాన్ని నడపడం, అంటే షో రన్ చేయడం దాదాపు అసాధ్యంగా కనిపిస్తుండటంతో ముఖ్యమంత్రి ముందస్తుకే మొగ్గు చూపుతున్నారని పార్టీ నేతలే చెబుతున్నారు. ప్రభుత్వ సలహాదారు సజ్జల అయితే.. జగన్ ఎప్పుడు అనుకుంటే అప్పుడే ఎన్నికలు జరుగుతాయని ముందస్తు విషయంలో బంతి జగన్ కోర్టులో ఉందని తేల్చేశారు.ముందస్తు ఎన్నికలకు పోతే ముందుగానే ఇంటికి పోతామని సొంత పార్టీ ఎమ్మెల్యేలే హెచ్చరిస్తున్నారు. అలాగని షెడ్యూల్ దాకా అగుదామంటే..మొదటికే మోసం వచ్చేలా వుంది. అందుకే అధికార పార్టీ నేతలు ముందస్తు ఎన్నికల విషయంలో ఓ రోజు ఔననీ, మరో రోజు కాదనీ ఆల్ మోస్ట్ నిర్ణయం తీసుకోవడానికి రోజు హెడ్ అండ్ టెయిల్ వేసుకుని ఆ మేరకు రోజుకో విధంగా మాట్లాడుతోంది.వాస్తవానికి ముందస్తు ఎన్నికల మాట ముందుగా వచ్చింది అధికార పార్టీ నేతల నుంచే. ఒక సారి కాదు ఒకటికి పది సార్లు జగన్ సర్కార్ లో సకల శాఖల మంత్రిగా వ్యవహరిస్తున్న పలు మార్లు ముందస్తు ప్రస్తావన తీసుకు వచ్చారు. నిజానికి, ప్రతిపక్ష పార్టీలు, ముందస్తు ఎన్నికలకు సంబంధించి అధికార పార్టీ వ్యూహాత్మకంగా తీసుకు వస్తున్న ముందస్తు చర్చను విపక్షాలే కాదు.. ప్రజలు కూడా పట్టించుకుంటున్న దాఖలాలు కనిపించడం లేదు.ముందస్తా కాదా అన్న విషయం పక్కన పెడితే ఎప్పుడు ఎన్నికలు వస్తాయా అని విపక్షాలతో పాటు జనం కూడా ఎదురు చూస్తున్నారు. ఈ విషయం స్పష్టంగా తెలిసినా వైసీపీ అగ్రనేతలు, ప్రభుత్వ పెద్దలూ మాత్రం తమను తాము మభ్యపెట్టుకోవడమే కాకుండా.. ప్రజలను కూడా మభ్య పెడదామని, పెట్టగలమని భావిస్తున్నారు. .అయితే, ఒకసారి ప్రజలు నిర్ణయానికి వచ్చిన తర్వాత ముందస్తు అయినా, కాకపోయినా ఫలితంలో పెద్ద తేడా ఉండదని పరిశీలకులు అంటున్నారు. అయినా ఇప్పుడు బంతి వైసీపీ కోర్టులోనే ఉందనీ, ముందస్తు అయినా కాకపోయినా ఫలితం ఏమిటన్నది ఇప్పటికే ఆ పార్టీకి అర్థమైపోయిందనీ అంటున్నారు.

## దీన జన బాంధవుడు బాబా ఆమ్టే

-నేడు ఆయన వర్ధంతి



బాబా ఆమ్టే అతని అసలు పేరు మురళీధర్ దేవదాస్ ఆమ్టే. ప్రముఖ సంఘసేవకుడిగా ప్రసిద్ధిగాంచిన బాబా ఆమ్టే ముఖ్యంగా కుష్టు రోగుల పాలిట దేవుడిగా మారినాడు. డిసెంబర్ 26, 1914లో మహారాష్ట్రలోని వార్ధా జిల్లా హింగన్‌ఘాట్‌లో ఒక ఉన్నత దేశస్థ బ్రాహ్మణ జాగిర్దార్ కుటుంబంలో జన్మించాడు. అతని అసలు పేరు మురళీధర్ దేవదాస్ అమ్టే కాగా చిన్నతనంలోనే అతన్ని బాబా అని పిలిచేవారు. బాబా అనేది ఎవరో ప్రధానం చేసిన బిరుదు కాదు అది తల్లిదండ్రులు పెట్టిన ముద్దుపేరు. న్యాయశాస్త్రంలో శిక్షణ పొందిన తరువాత వార్ధాలో న్యాయ అభ్యాసం ప్రారంభించాడు. అదే సమయంలో భారత జాతీయోద్యమ పోరాటం జరుగుతుండేది. క్విట్ ఇండియా ఉద్యమ సమయంలో అరెస్ట్ కాబడిన జాతీయ నేతల తరఫున కోర్టులలో వాదించేవాడు. క్రమక్రమంగా మహాత్మా గాంధీ వైపు ఆకర్షితుడైనాడు. గాంధీజీతో పాటు కొంత కాలం సేవాగ్రం ఆశ్రమంలో గడిపినాడు. ఆ తరువాత జీవితాంతం వరకు గాంధీజీ సిద్ధాంతాలకే కట్టుబడినాడు. వేషధారణలో కూడా గాంధీజీ వలె ఖద్దరు దుస్తులనే వాడేవాడు. గాంధీజీ వలె జీవితాంతం అణగారిన వర్గాల కృషికై పాటుపడ్డాడు. సమాజంలోని రుగ్మతలు, పేదల దీన స్థితికి చలించే ఆయన తన జీవితాన్ని కుష్టు రోగుల సేవలకు, వారి పునరావాసానికి కృషి చేశారు. పర్యావర్ణ పరిరక్షణకూ, అడవులు పెంపకానికి ఆయన కృషి చేశారు.కుష్టురోగుల సేవలకై చంద్రాపూర్ జిల్లాలో ఆనంద్‌వన్ ఆశ్రమాన్ని స్థాపించి అతను కూడా వారితోపాటే అక్కడే జీవితాన్ని గడిపి 2008, ఫిబ్రవరి 9న తన ఆశ్రమంలోనే మృతి చెందిన మహనీయుడు. ఉన్నత కుటుంబంలో జన్మించి భోగభాగ్యాలను వదిలి అణగారిన వర్గాల మేలు కొరకై జీవితాంతం కృషిసల్పిన అతని కృషి మరవలేనిది.బాబా ఆమ్టే సేవలకు గుర్తింపుగా అనేక అంతర్జాతీయ, జాతీయ అవార్డులు వచ్చాయి. రామన్ మెగసేసే అవార్డు, జాతీయ పద్మ అవార్డులు ఆయనను వరించాయి.

## రెండేళ్ల తర్వాత మళ్లీ మేరీమాత తిరునాళ్లు

విజయవాడ, ఫిబ్రవరి 8, ప్రతి ఏటా ఫిబ్రవరి 9, 10, 11 తేదీలలో గుణదల మేరీ మాత ఉత్సవాలు నిర్వాహించటం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా ఈ ఏడాది సైతం ఉత్సవాల నిర్వాహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని విజయవాడ కేథలిక్ పీఠం బిషప్ తెలగతోటి జోసెఫ్ రాజారావు తెలిపారు. మూడు రోజులపాటు అత్యంత వైభవంగా జరగనున్న ఉత్సవాలకు లక్షలాదిమంది భక్తులు రానున్నారని వారికి అన్ని ఏర్పాట్లు సర్వ సిద్ధం చేసినట్లు ఆయన పేర్కొన్నారు. మేరీమాత ఉత్సవాలు సమిష్టి దివ్యబలి పూజ సమర్పించి భక్తులకు దివ్య సత్య ప్రసాదాన్ని అందజేయడం జరుగుతుందని చెప్పారు. బిషప్ గ్రాసి పాఠశాల ద్వారా కొండ పైకి చేరుకుని మేరీమాతను దర్శించుకుని తమ మొక్కుబడులు చెల్లించుకోవచ్చని తెలిపారు. ఉత్సవాలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు గుణదల పుణ్యక్షేత్రం నిర్వాహకులు, ఉత్సవ నిర్వాహకులు ఫాదర్ మువ్వల ప్రసాద్, పుణ్యక్షేత్రం రెక్టర్ ఫాదర్ యేలేటి విలియం జయరాజు తెలిపారు. ఉత్సవాలకు తెలుగు రాష్ట్రాలతో పాటు దక్షిణ భారత దేశం నుండి పెద్ద సంఖ్యలో యాత్రికులు రానున్నారని చెప్పారు.పవిత్ర గుణదల మాత మహోత్సవాలు జరుగుతున్న సందర్భంగా వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా పోలీస్ పరంగా అన్ని భద్రత చర్యలు చేపట్టామని డిసిపి విశాల్ గున్ని తెలిపారు. మేరీ మాత మహోత్సవ ప్రాంగణాన్ని, డిసిపి విశాల్ గున్ని పరిశీలించారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చి భక్తులకు భద్రతా విషయంలో ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా భారీ పోలీస్ బందోబస్తు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. మేరీ మాత మహోత్సవాలకు లక్షలాది మంది భక్తులు హాజరుకానున్న క్రమంలో పోలీస్ భద్రతను కట్టుదిట్టం చేస్తున్నట్టు చెప్పారు. మూడు రోజుల పాటు నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు అమలులో ఉంటాయని అన్నారు. కోల్ కత్తా జాతీయ రహదారికి దగ్గరలోనే గుణదల కొండ ప్రాంతం ఉండటంతో ట్రాఫిక్ మళ్లింపు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.బ్రిటిష్ ప్రభుత్వం 1924లో గుణదలలో సెయింట్ జోసఫ్ ఇనిస్టిట్యూట్ పేరుతో అనాథ శరణాలయం ఏర్పాటు చేసింది. ఇనిస్టిట్యూట్ కు డైరెక్టర్‌గా ఇటలీకి చెందిన ఫాదర్ పి. అర్లాటి ని నియమించారు. ఆయనే గుణదల కొండపై చిన్న మేరీమాత విగ్రహాన్ని ప్రతిష్ఠించడంతో మేరీమాత గుడికి అంకురార్పణ జరిగింది. అప్పటి నుండి మేరిమాత ఆలయానికి భక్తులు పెద్ద ఎత్తున రావటం ఆరంభం అయ్యింది. 1933లో ఫాదర్ అర్లాటి చేతులు మీదగా గుణదల కొండ శిఖరం పైన శిలువ ను ప్రతిష్ఠించారు. 1947లో విజయవాడ నగరంలో స్థిరపడిన తమిళనాడుకు చెందిన కథోలికులు, ఫాదర్ అర్లాటి ఆధ్వర్యంలో కొండ పైన ఆరోగ్యమాత విగ్రహాన్ని నెలకొల్పారు.గుహ ప్రాంగణంలో విశాలమైన దివ్య బలిపీఠాన్ని నిర్మించారు.1946 నుండి తిరునాళ్ళు ఘనంగా జరుగుతున్నాయి.1948లో కలరా ప్రబలటంతో తిరునాళ్ళు నిర్వహించలేదు.. ఆ తరువాత ఇటీవల మరో సారి కరోనా కారణంగా గుణదల మాత ఉత్సవాలను రద్దు చేయాల్సి వచ్చింది.

## రాకాసి అలలపై ఇస్రో నిఘా

విశాఖపట్టణం, ఫిబ్రవరి 8, విశాఖలో ప్రకృతి సహజ సిద్ధంగా ఏర్పడిన సుందరమైన బీచ్‌లు పర్యాటకులను కట్టిపడేస్తుంటాయి. చల్లని గాలులు.. సుతి మెత్తని ఇసుక? కవ్వించే కెరటాలు కాలి పాదాలకు తాకుతూ అలా వెళుతూ ఉంటే వాటి వైపు ఆకర్షితులవకుండా ఉండలేరు సందర్శకులు. అందుకే కేవలం విశాఖ నుంచి మాత్రమే కాకుండా.. ఇతర రాష్ట్రాల నుంచి విదేశాల నుంచి కూడా వచ్చే సందర్శకుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. ఆర్కే బీచ్‌తో పాటు ఋషికొండ, యారాడ, సాగర్ నగర్, భీమిలి వేటికవే ప్రత్యేకతను సంతరించుకుని పర్యాటకలను తన వైపు అట్రాక్ట్ చేస్తూ ఉంటాయి. ఇంతవరకు బాగానే ఉన్నా.. ఈ తీర ప్రాంతలు కొన్ని సందర్భాల్లో డెడ్లీ బీచ్ లుగా మారిపోతున్నాయి. ఎందుకంటే? కనిపించకుండా అలల మాటున వచ్చే రిప్ కరెంట్స్ సందర్శకుల పాలిట మృత్యు కెరటాలుగా మారుతున్నాయి. రాకాసి అలలుగా పిలిచే ఈ రిప్ కరెంట్.. అమాంతంగా సందర్శకులను మింగేస్తున్నాయి. గాలి ద్వారా ఏర్పడిన అలలు నీటి అడుగున బలమైన ప్రవాహంగా మారి తీర ప్రాంతం వైపు దూసుకు వస్తున్నాయి. చాప కింద నీరుల.. కెరటాల కింద నుంచి వచ్చి అమాంతంగా తీరంలో జలకాలాడే జనాలను లాగేస్తోంది.అలలు రిప్ కరెంట్‌గా మారి తీరాన్ని తాకినప్పుడు సముద్రపు అడుగున బలమైన ప్రవాహంలా ఏర్పడుతుంది. రిప్ కరెంట్ సెకనుకు రెండు నుంచి ఎనిమిది అడుగుల వేగం ఉంటుంది. తీరం వైపు దూసుకు వచ్చే రిప్ కరెంట్? తీరని తాకినప్పుడు ఒకలా ఉండి, వెనక్కి వెళ్ళినప్పుడు దాని రూపాన్ని మార్చుకుంటుంది. రిప్ కరెంట్ చీలి పది అడుగుల నుంచి వందల అడుగుల వెడల్పు వరకు విడిపోయి రెప్పపాటులో వెనక్కి మల్లుతుంది. ఈ సమయంలోనే అక్కడ ఉన్న సందర్శకుల కాళ్ల కింద ఇసుక కొట్టుకుపోయి కెరటాల తాకిడితో సముద్రం లోపలికి లాక్కెళ్ళిపోతుంది. రెప్పపాటులో జరిగే ఈ రిప్ కరెంట్ ప్రభావంతో ఆటుపోట్ల సమయంలో గజ ఈతగాళ్లు కూడా బయటపడలేని సందర్భాలు అనేకం ఉన్నాయి.ప్రతీయేటా బీచ్ ప్రమాదాల బారిన పడి పదుల సంఖ్యలో సందర్శకులు ప్రాణాలు కోల్పోతున్న నేపథ్యంలో జీవీఎంసీ పోలీస్ యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టింది. లైఫ్ గార్డ్స్ పేరుతో గజ ఈతగాలన్ని నియమించింది. సందర్శకుల రద్దీ ఎక్కువగా ఉండే బీచ్‌లలో పహారా ఏర్పాటు చేస్తోంది.. చాలా సందర్భాల్లో బీచ్ లో కొట్టుకుపోతున్న సందర్శకులను గజతగాళ్లు రక్షించారు. అయినప్పటికీ ఆ కెరటాల రాకను ముందస్తుగా పసిగట్ట లేకపోవడంతో ఇప్పటివరకు ప్రమాదాల తీవ్రత పెరుగుతూ వస్తోంది. దీంతో ఇస్రో డెవలప్ చేసిన ఎనీబటజీఇ. ఐనీల.తిని వెబ్సైట్ ఇచ్చే సమాచార వ్యవస్థను అందిపుచ్చుకొని విశాఖ సిటీ పోలీసులు ముందుకు వెళుతున్నారు.దేశంలోనే 175 బీచ్ లలో గత 20 ఏళ్ల కాలంలో జరిగిన ప్రమాదాల్లో కెరటాల తీవ్రతను అంచనా వేస్తూ పరిశోధనలు నిర్వహించారు. సందర్శకుల ప్రాణాలు తోడేస్తున్న రిప్ కరెంట్ రాకను ముందుగానే పసిగట్టేలా సమాచార వ్యవస్థను సిద్ధం చేసి ఆ వెబ్‌సైట్‌లో పొందుపరుస్తున్నారు. కచ్చితంగా ఏ బీచ్ లో ఎప్పుడెప్పుడు ప్రమాదకర పరిస్థితిలో కెరటాలు వస్తున్నాయి అన్నది స్పష్టంగా తెలుసుకునేలా సమాచారాన్ని బీచ్‌ల వారీగా అందులో అప్ డేట్ చేస్తున్నారు. దీంతో ఈ అధునాతన సాంకేతిక వ్యవస్థ ద్వారా వచ్చే సమాచారాన్ని అందిపుచ్చుకొని విశాఖ సిటీ పోలీసులు బీచ్ లో మరింత రక్షణ వ్యవస్థను మెరుగుపరిచేలా ఏర్పాట్లు చేస్తున్నారు.ఐదు రోజులు ముందస్తుగానే సమయం తేదీ వారీగా కెరటాల తాకిడి, తీవ్రత తెలిపేలా ఈ సమాచార వ్యవస్థ ఉండడంతో సందర్శకుల ప్రాణాలకు మరింత భరోసానిచ్చేలా పోలీసులు ముందుకు వెళ్తున్నారు. కేవలం పోలీసులే కాదు, ఈ వెబ్సైట్ ద్వారా ఇతర ప్రాంతాల నుంచి బీచ్‌లకు వచ్చే పర్యాటకులు కూడా అప్రమత్తంగా ఉండే అవకాశం ఉందని అంటున్నారు నిపుణులు. ఎవరు ఎన్ని చర్యలు చేపట్టినా? ఎవరికి వారు నియంత్రించుకుంటూ బీచ్ సందర్శనలో జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## ఎగువ భద్ర ప్రాజెక్ట్ నిర్మాణం తో రాయలసీమకు తీవ్ర అన్యాయం



సీమకు అన్యాయం జరుగుతున్నా స్పందించని ప్రభుత్వం

అఖిలపక్ష నేతల మండిపాటు

కడప తుంగభద్ర డ్యామ్ పై భాగంలో ఎగువభద్ర ప్రాజెక్టు నిర్మాణానికి బిజెపి ప్రభుత్వం 5,300 కోట్ల నిధులను విడుదల చేసి రాయలసీమ రైతాంగానికి తీవ్ర అన్యాయం చేస్తున్నారని కడప జిల్లా అఖిలపక్ష నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు... బుధవారము కడప ప్రెస్క్లబ్లో ఎగువ భద్ర ప్రాజెక్టు నిర్మాణం- రాయలసీమ నీటి సమస్యలు అంశం పైన ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు ఎంవి సుబ్బారెడ్డి అధ్యక్షతన రౌండ్టేబుల్ సమావేశం నిర్వహించడం జరిగింది... ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య, సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, రాయలసీమ సాగునీటి ప్రాజెక్టుల కన్వీనర్ దేవగుడి చంద్రమౌళీశ్వర్ రెడ్డి ,సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, ఆర్ సి పి రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్ రెడ్డి, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొమ్మది ఈశ్వరయ్య, లోక్సత్తా పార్టీ నాయకులు కృష్ణయ్య, బిఎస్పి పార్టీ నాయకులు గుర్రప్ప ,కాంగ్రెస్ పార్టీ నాయకులు సత్తార్ లు మాట్లాడారు... ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కర్ణాటక రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో లబ్ధి పొందడానికి ఆ రాష్ట్ర ప్రజలకు ప్రయోజనం చేకూర్చే ఎగువ భద్ర ప్రాజెక్టుకు 5300 కోట్ల రూపాయలు నిధులు కేటాయించడం జరిగిందని... పై భాగంలో ఈ ప్రాజెక్టు నిర్మించడం వల్ల దిగువ ప్రాంతంలో ఉన్న రాయలసీమ రైతాంగానికి తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రాయలసీమ ప్రాంతానికి ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని విభజన చట్టంలో స్పష్టంగా ఉన్నప్పటికీ.... ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వకుండా రాయలసీమ రైతుల నోట్లో దుమ్ము కొడుతూ కర్ణాటక ఆంధ్ర రాష్ట్రాల మధ్య చిచ్చు పెట్టేందుకు బిజెపి సర్కార్ కుట్రలు పడుతుందని అన్నారు. ఎగువ భద్ర ప్రాజెక్టు నిర్మిస్తే తుంగభద్ర డ్యామ్ దిగువ భాగం లో ఉన్న ఎల్.ఎల్.సి.,హెచ్.ఎల్.సి, రాజోలు బండ డైవర్షన్ స్కీమ్ పోతిరెడ్డిపాడు మొదలగు వాటికి నీరు అందక ఈ ప్రాంత రైతులు తీవ్ర ఇబ్బందులు పడతారని ఆవేదన వ్యక్తం చేశారు ఈ అంశం పైన జగన్ సర్కార్ స్పందించకుండా కాలయాపన చేస్తుందని, తక్షణం ఎగువ భద్ర ప్రాజెక్టు నిర్మాణం ఆపాలని తీర్మానం చేసి కేంద్రానికి నివేదిక పంపాలని డిమాండ్ చేశారు.. రాయలసీమ ప్రాంతంలో ఉండే ప్రజా ప్రతినిధులు నోరు మెదపకపోవడం సిగ్గుచేటు అన్నారు... ఈ అంశంపై ఈనెల 12వ తారీఖున అఖిలపక్షం ఆధ్వర్యంలో కోటిరెడ్డి సర్కిల్లో నిరసన కార్యక్రమం చేపడుతున్నామని తెలిపారు..ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దస్తగిరి రెడ్డి, ఏఐటీయూసీ నాయకులు బాదుల్లా ,డి హెచ్ పి ఎస్ జిల్లా అధ్యక్షులు బందెల ఓబయ్య ,డిడికేఎస్ జిల్లా అధ్యక్షులు నాగేశ్వరరావు, రైతు సంఘం ఉపాధ్యక్షులు జయన్న, శంకర్ రెడ్డి ,యానాదయ్య, శేఖర్ రెడ్డి సావంత్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు

## రేషన్ బియ్యం డోర్ డెలివరీ చేయాలి... సిపిఐ.

తహసిల్దార్ కు వినతి పత్రం ఇస్తున్న సిపిఐ నాయకులు.



పత్తికొండ రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేసే రేషన్ బియ్యాన్ని దిద్ది చేను కొట్టాల కాలనీ వాసులకు డోర్ డెలివరీ చేయాలని సిపిఐ మండల కార్యదర్శి డి.రాజా సాహెబ్, డిమాండ్ చేశారు. బుధవారం సిపిఐ పట్టణ సమితి ఆధ్వర్యంలో తహసిల్దార్ విష్ణు ప్రసాద్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వెనుక వైపు పేదలు నివాసం ఉండే దిద్ది చేను కొట్టాల కాలనీ లో 150 కుటుంబాలు నివాసం ఉంటున్నాయని, అయితే ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా సరఫరా చేసే రేషన్ బియ్యం డోర్ డెలివరీ వాహనం కాలనీకి రాకపోవడంతో, పేద ప్రజలకు రేషన్ బియ్యం తో పాటు నిత్యావసర సరుకులు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి ప్రతినెల క్రమం తప్పకుండా దిద్ది చేను కొట్టాల కాలనీకి రేషన్ బియ్యం వాహనం ద్వారా డోర్ డెలివరీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి.ఎన్.రామాంజనేయులు సిపిఐ జిల్లా సమితి సభ్యులు సురేంద్ర కుమార్, తిమ్మయ్య, కృష్ణయ్య, శాఖా కార్యదర్శి రవి, కొత్తపల్లి, పందికోన, పెద్దహుల్తి శాఖ కార్యదర్శులు గిడ్డయ్య గౌడ్, జోహారాపురం కాశి, రాజప్ప, ఏఐటీయూసీ తాలూకా అధ్యక్షులు నెట్టికంటయ్య, మాదన్న, కాలనీ మహిళలు పాల్గొన్నారు.

## మైనారిటీల సమస్యలు పరిష్కరించండి

కడప కడప జిల్లా పర్యటనకు విచ్చేసిన జాతీయ మైనారిటీ కమిషన్ సభ్యురాలు సయ్యద్ షేహజాది ని స్థానిక ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్లో ప్రముఖ సంఘ సేవకులు సయ్యద్ సలవుద్దీన్ కలిసి వినతిపత్రం అందజేశారు ఈ సందర్భంగా సలావుద్దీన్ మాట్లాడుతూ రాజకీయంగా, సామాజికంగా తాము ఎంతో వెనుక ఉన్నామని ఆవేదన వ్యక్తంచేశారు విద్య, ఉపాధి రంగాల్లో అవకాశాలు కల్పించాలని కోరారు ఎన్ని ప్రభుత్వాలు మారినా తమ ముస్లిం మైనారిటీల సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయని చెప్పారు యువత కు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు మైనారిటీల సంక్షేమానికి కృషి చేసి తమ వర్గాల అభ్యున్నతి చేయూత నివ్వాలన్నారు ముఖ్యంగా కడప నగరంలోని హజ్ హౌస్ ను పరిశుభ్రం చేసి మనుగడ లోకి తీసుకొని రావాలని కోరారు ఈ సందర్భంగా కమిషనర్ సయ్యద్ షేహజాది మాట్లాడుతూ మైనారిటీల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు తన వంతు సహకారం అందిస్థామని చెప్పారు

## లోకేష్ యువగళం కు సంఘీభావం గా పాద యాత్ర



సిద్దవటం మండలం తెలుగుదేశం పార్టీ ఆద్వర్యంలో లోకేష్ యువగలం పాదయాత్ర జయప్రదం కావాలని కోరుకుంటూ రాజంపేట నియోజకవర్గం ఇంచార్జి బత్యాల చంగాలరాయుడు ఆధ్వర్యంలో శ్రీ శ్రీ శ్రీ నిత్యపూజయ్య స్వామి కొనకు సిద్దవటం నుండి నిత్యపూజయ కొండకు సుమారు 18 కి మి పాదయాత్ర గా రాజంపేట పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి నాగముని రెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీనివాసులు, పార్లమెంట్ బీసీ సెల్ అధికార ప్రతినిధి జింక శివ,బీసీ సెల్ కార్యదర్శి ఓబీనేని శ్రీనివాసులు,31బూత్ సన్వీనర్ బండి ఓబులేసు, బోడిచర్ల శ్రీనివాసులు, రఘు, జనార్ధన్ రాజు, పి. శంకర్, గంగాధర్, చంద్రశేఖర్ నాయుడు, సుబ్బయ్య, కొండవీటి సింహం, పి. చిన్నయ్య, యనది, మరియు పార్ట్ అధ్యకుడు మోహన్ రెడ్డి, క్లస్టర్ ఇంచార్జి దశనదా నాయుడు, బీసీ సెల్ అధికార ప్రతినిధి రాజశేఖర్ యాదవ్, బాబీలీ, హరి, మొదలగొన్న వారు పాదయాత్ర స్వామి కొనకు చేరుకొని స్వామి వారికీ అర్చన, రుద్రభిషేఖం చేయించి నారా లోకేష్ చెప్పట్టిన యువగలం పాదయాత్ర సజావుగా జరగాలని వచ్చే ఎన్నికల్లో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాలని, మన నాయకుడు బీసీఆర్ ఎమ్మెల్యే కావాలని, గంట నరహరి ఎంపీ గా గెలవాలని స్వామి వారికీ ప్రత్యక పూజలు చేయించి 101 టెంకాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేశారు

## ఆరోగ్య కేంద్రాలలో విజిలెన్స్ తనిఖీలు

తిరుపతి రాష్ట్ర వ్యాప్తంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ల లో విజిలెన్స్ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. తిరుపతి, చిత్తూరు జిల్లాలో విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారి కె ఈశ్వర రెడ్డి ఆధ్వర్యం లొ అధికారులు నాలుగు బృందాలుగా ఏర్పడి బుధవారం నాడు ఉదయం నుండి పట్టణ కమ్యూనిటీ హెల్త్ సెంటర్, తిరుపతి, పిహెచ్సి కె.వి.బి.పురం, కమ్యూనిటీ హెల్త్ సెంటర్, సూళ్ళూరుపేట, పిహెచ్సి తుంబకుప్పం, బంగారుపాలెం మండలం యందు తనిఖీలు నిర్వహించారు.ఈ తనిఖీలలో ప్రపంచ ఆరోగ్య సంస్థ, రాష్ట్ర ఆరోగ్య శాఖ ఇచ్చిన సూచనల ప్రకారం రోగులకు చికిత్స జరుగుతుంగా, తగిన వసతులు, వైద్యులు, నర్సులు అందుబాటులో ఉంటున్నారా, రోగులకు వైద్య పరిక్షలు నిర్వహణ మరియు మందులు తగినంతగా ఉన్నాయా అనే విషయాలపై తనిఖీలు లు నిర్వహించారు. అలాగే ఆర్బికే కేంద్రాల మీద, సంక్షేమ వసతి గృహాల మీద, ఆరోగ్య కేంద్రాల మీద, ప్రభుత్వ పథకాల అమలు మీద నిరంతరం పరిశీలన కొనసాగుతూనే ఉంటుంది అని చెప్పారు.

## అల్ప సంఖ్యాక వర్గాల సంక్షేమానికి ప్రభుత్వాల కృషి: కమిషన్ సభ్యురాలు షెహ జాది

కడప కలెక్టరేట్ ఫిబ్రవరి 8 : ఉదయం న్యూస్: అల్ప సంఖ్యాక వర్గాల సంక్షేమాభివృద్ధికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని జాతీయ మైనార్టీ కమిషన్ సభ్యురాలు సయ్యద్ షెహజాది పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో వివిధ మైనార్టీ వర్గాల సంఘాల నేతలు,మైనార్టీ వర్గాల మత పెద్దలు, వివిధ నాయకులతో వారు సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జాతీయ మైనార్టీ కమిషన్‌సభ్యురాలు మాట్లాడుతూ... రాజ్యాంగబద్ధంగా ఏర్పాటైన జాతీయ మైనార్టీ కమిషన్ మైనార్టీల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర శాసనసభలు చేసిన చట్టాల అమలు తీరును,సమస్యలను పర్యవేక్షించడం జరుగుతుంద న్నారు.ఈ కమిషన్‌కు సివిల్ కోర్టు అధికారాలు ఉంటాయన్నారు. మైనారిటీలు ఎదుర్కొంటున్న సమస్యలు, హక్కులకు సంబంధించిన అంశాలను కమిషన్ దృష్టికి తీసుకొని వస్తే సంబంధిత అధికారులపై తగిన చర్యలు తీసుకోవలసినదిగా సిఫార్సు చేస్తుందని చెప్పారు. అనంతరం వివిధ సంఘాల మైనార్టీ నేతల వినతులను ఆమె స్వీకరించా రు.ఇందులో మౌలానా కలాం ఆజాద్ ఫెలోషిప్ స్కాలర్ షిప్ లను నిలిపివేశారని తిరిగి వాటిని పునః ప్రారంభించాలని కోరారు. జిల్లాలో దర్గా భూములను కబ్జాకు గురి కాకుండా చూడాలని విన్నవించారు. మైనార్టీ విద్యా వ్యవస్థ పై ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి చేయాలని కోరారు జాతీయ మైనార్టీ కమిషన్ సభ్యురాలు సయ్యద్ షెహజాది బుధవారం అమీన్ పీర్ పెద్ద దర్గాను దర్శించుకున్నారు. దర్గా పెద్దలు ఆమెకు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అనంతరం ఆమె పూల ఛాదర్‌ను సమర్పించి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. . ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ..దేశంలో ప్రసిద్ధిగాంచిన అమీన్ పీర్ దర్గాను సందర్శించడం సంతోషంగా ఉందన్నారు. దేశ ప్రజలందరికీ మంచి జరగాలని, సుఖ సంతోషాలతో ఉండాలని ప్రార్థించామన్నారు.ఈ సమావేశంలో రాష్ట్ర మైనారిటీ కమిషన్ సభ్యులు ఇదయతుల్లా, ఆర్టీవో ధర్మ చంద్రా రెడ్డి, జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ఇంఛార్జి అధికారి క్రిష్ణ కిషోర్, నగర కార్పొరేటర్ షఫీ, వివిధ మైనార్టీ సంఘాల నేతలు, మైనార్టీ మత పెద్దలు,పాల్గొన్నారు

# మార్కెట్ ప్రసాద్ తో ప్రత్యేక ఇంటర్వ్యూ

నంద్యాల :- ఆయన ఇంటి పేరు లక్క బోయిన ఆయన పేరు ప్రసాద్. అందరూ మార్కెట్ ప్రసాద్ గా పిలుస్తారు. ఆయన మాట్లాడుతూ నాకు శివయ్య అంటే పంచ ప్రాణం.మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలకు - మహానంది - శ్రీకాళహస్తి దేవస్థా నములకు కొన్ని పదుల సంవత్సరములుగా కూరగాయలు ఉచితంగా సరఫరా చేస్తున్నారు ..శ్రీ మహానంది దేవస్థానం (మహానంది) కి 19 సంవత్సరాలుగా ప్రతి రోజూ ఉచితంగా కూరగాయలు



సరఫరా చేస్తున్నారు . మా ఇంటి పేరు లక్క బోయిన ప్రసాద్. నన్ను అందరూ ఇంటి పేరుగా మారిపోయిన కూరగాయల ప్రసాద్ (మార్కెట్ ప్రసాద్ ) అని అంటరాని తెలిపారు. కూరగాయల దాత సుఖీభవ అంటున్న భక్తులు .ముక్కంటి ఈశ్వరుని కి మారెడు ధలం అంటే శివయ్యకు ఇష్టం -- నీటితో అభిషేకం ప్రీతికరం. అభిషేకం చేస్తే ఆ శివయ్య కోరిన కోర్కెలు తీరుస్తారని నమ్మకం -- పైసా ఆశించకుండా నోరు గట్టిదైన వ్యాపారంలో లాభాలు గడుస్తున్నా శివయ్య అంటే ఎంతో ఇష్టం. ఆరడుగుల ఆజాను బాహుడు- తెల్లటి వస్త్రాలు ధరించి ఆప్యాయంగా అందరితో కలుపు కొని పోయే మనస్తత్వమైన, మాట కొద్దిగా కటువుగా ఉన్నా వెన్నె పూస లాంటి మనసున్న మారాజుగా "మార్కెట్ "లో పేరు తెచ్చుకున్నారు .శివయ్యకు సేవ చేయడానికి ఆయనతో ఆయన సతీమణి , కువారుడు చేదోడు వాదోడుగా నిలిచారు. ప్రతినిత్యం ఏదో ఒక సమయంలో నంద్యాల నుంచి మహానంది కి బయలు దేరి ఆ మహానందీశ్వరుని దర్శనం చేసుకుంటారు.చేసేది కూరగాయల వ్యాపారం. వ్యాపారంలో వచ్చిన లాభాల్లో కాసింత శివయ్య భక్తులకు ఇస్తుంటారు. వేన్నీళ్ళకు, చన్నీళ్ళు తోడినట్లు దేవాలయంలో భక్తులకు నిర్వహించే ఉచిత అన్నదానం లకు నిత్యం కూరగాయలు అందిస్తూ అందరి ప్రశంసలు పొందుతున్నారు. తిరుపతి జిల్లా లో ఉన్న ప్రముఖ శైవ క్షేత్రం శ్రీ కాళహస్తి దేవస్థానం కు గత 15 సంవత్సరాలుగా మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలకు కూరగాయలు పంపిస్తు అక్కడ అధికారుల చేత మన్ననలు పొందుతున్నారు. అంతే గాక నంద్యాల జిల్లా చుట్టుపక్కల ఎటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరిగిన కూరగాయల వితరణ చేస్తు అందరి మన్ననలు పొందుతున్నారు.

# జూనియర్ కళాశాల బాలికలకు 3 కోట్ల రూపాయలతో 12 నూతన గదులు ప్రారంభం..



నంద్యాల :-నంద్యాల పట్టణంలోని ఎస్ వై వి సి పి ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల నందు నూతనంగా నిర్మించిన 12 గదులను దాదాపు మూడు కోట్ల రూపాయలతో ఆర్ డీటి . సంస్థవారి సహకారంతో బుధవారం నాడు ఆర్డిటి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ మంచో ఫెర్రర్ మరియు ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి ప్రారంభించారు. ఎన్నో సంవత్సరాలుగా విద్యార్థులు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఉపాధ్యాయులు ఎమ్మెల్యే శిల్పా రవి రెడ్డి దృష్టికి సమస్యలను తీసుకురావడంతో ఎమ్మెల్యే వెంటనే సమితి ఆర్డిటి వారిని కళాశాల అభివృద్ధికి సహకరించాలని కోరడంతో వారు వెంటనే స్పందించి కళాశాలకు కృషి చేయడంతో కళాశాల ఉపాధ్యాయులు విద్యార్థులు ఎమ్మెల్యే శిల్ప రవిచంద్ర కిషోర్ రెడ్డికి ఆర్డిటి సంస్థ వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు..ఈ సందర్భంగా నంద్యాల శాసనసభ్యులు శిల్ప రవిచంద్ర కిషోర్ రెడ్డి మాట్లాడుతూ నంద్యాల పట్టణంలోని పాలిటెక్నిక్ కాలేజీ పక్కన ఉన్న ప్రభుత్వ బాలికల కళాశాల కు వెళ్ళినప్పుడు కళాశాల చాలా దుర్భర స్థితిలో ఉండేది విద్యార్థులు కూర్చోడానికి చదువుకోవడానికి టాయిలెట్ లేక చాలా ఇబ్బందులు పడుతుండేవారని వారిని చూసి ఎంతో బాధ కలిగిందన్నారు ఎలాగైనా కళాశాల ను మార్చాలన్న తపన ఏర్పడిందన్నారు. వెంటనే ఆర్డిటి సంస్థ వారితో మాట్లాడి కళాశాల అధ్యాపకులను అనంతపురం పంపించడం జరిగిందన్నారు. ఆర్ డి టి సంస్థ వారు మరియు పట్టణ ప్రముఖులు మొత్తం కలిపి దాదాపు మూడు కోట్ల రూపాయలును అందించి విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాట వేశారన్నారు. అలాగే నంద్యాల పట్టణంలోని ఒకటో వార్డు పివి నగర్ నందు ఆర్ డి టి సౌకర్యంతో 120 గృహాలను నిర్మించడానికి ముందుకు వచ్చారని వారికి నంద్యాల నియోజకవర్గ ప్రజల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టిటి ప్రాజెక్ట్ డైరెక్టర్ మంచో ఫెరర్, ఇషాక్ బాషా,మున్సిపల్ చెర్ పర్సన్ మబన్నీ సా, రాష్ట్ర దృశ్య కళల డైరెక్టర్ సునీత అమృత రాజ్ ,ఎపి యస్ పీ డి సి యల్ . డైరెక్టర్ శశికళ రెడ్డి,కళాశాల ప్రిన్స్ పల్ షోమశేకర్ అప్ప,రిటైడ్ ప్రిన్సిపాల్ సునీత,మరియు సహకరించిన దాతలు మరియు వైసీపీ నాయకులు కళశాల ఉపాధ్యాయులు విద్యార్థినులు పాల్గొన్నారు.

# మహానంది మండలం లో సర్వసభ్య సమావేశం

నంద్యాల :-నంద్యాల జిల్లా, మహానంది మండలంలో బుధవారం నాడు , సర్వసభ్య సమావేశం బుక్కాపురం గ్రామంలోని మండల మహిళ సమాఖ్య కార్యాలయనీలో ఎంపీపీ బుడ్డా రెడ్డి యశస్విని గారి అధ్యక్షతన నిర్వహించారు . ఈ సందర్భంగా వివిధ శాఖ అధికారులతో ఎంపీపీ సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ఎంపీపీ బుడ్డారెడ్డి యశస్విని గారు మాట్లాడుతూ మండలంలో కొన్నిచోట్ల నీటి ట్యాంకులు శుభ్రపరచకుండా వదులుతున్నారని తమ దృష్టికి కంప్లైంట్స్ వస్తున్నాయని అన్నారు. పంచాయతీ సెక్రటరీలకు ప్రతి 15 రోజులకు ఒకసారి శుభ్రం చేపించాలని చెప్పారు, అదేవిధంగా పైపులైన్స్ అక్కడక్కడ లీకేజీ ఉండి కలుషిత నీరు కలుస్తున్నాయని, వీటన్నిటిని సరి చూసుకోవాలని అధికారులకు సూచించారు . ఈ కార్యక్రమంలో ఎంపీపీ తోపాటు జడ్పిటిసి మహేశ్వర్ రెడ్డి, ఎంపీడీవో శివ నాగజ్యోతి, ఎమ్మార్వో జనార్దన్ శెట్టి, ఎంపీటీసీలు సర్పంచులు మరియు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# బద్వేలులో దురాక్రమణలపై చర్యలు ఎప్పుడు?

బద్వేలు ,దర్జాగా రహదారులు మురికి కాలువలు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిన దురాక్రమదారులపై సంబంధిత అధికారులు ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు కనీసం అలాంటి ప్రయత్నాలు కూడా చేయకపోవడం విమర్శలకు కారణమవుతుంది అసలు దురాక్రమలపై చర్యలు తీసుకుంటారా లేదా అన్నది శేష ప్రశ్నగా మారింది ఆక్రమణలు ఏ స్థాయిలో ఉన్న వాటిని తొలగించాలని ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అమరావతిలో జరిగిన ఉన్నత అధికారుల సమావేశంలో స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు ముఖ్యమంత్రి సొంత జిల్లా అయిన బద్వేలు లో గత కొన్ని దశాబ్దాలుగా రహదారి పక్కనే ఆక్రమణ లు కొనసాగుతున్నాయి ఇది అందరికి తెలిసిన బహిరంగ రహస్యమే మురికి కాలువలు రోడ్లు ఆక్రమించి నిర్మాణాలు చేసి వాటిని వేల రూపాయలకు బాడుగలకు ఇచ్చి ప్రతి నెల వసూలు చేసుకుంటున్నారు ఆక్రమణల కారణంగా రహదారులు ఇరుకై తరచూ రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి ఇప్పటికే ఎన్నో ప్రమాదాలు జరిగాయి జరుగుతున్నాయి కూడా ప్రమాదాల్లో ఎంతోమంది ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి పట్టణంలోని నాలుగు ప్రధాన రహదారుల్లో పెద్ద ఎత్తున ఆక్రమణలు ఉన్నాయిపట్టణంలో మైదుకూరు నెల్లూరు కు వెళ్లే ప్రధాన రహదారి జాతీయ రహదారిగా ఉంది జాతీయ రహదారి మాటే గాని గతంలో ఎలా ఉందో ఇప్పుడు కూడా అలాగే ఉంది జాతీయ రహదారి నిర్మించేటప్పుడు సంబంధిత అధికారులు ఆక్రమణ లు తొలగించేందుకు రోడ్డుకు ఇరువైపులా మార్కింగ్ ఇచ్చారు కానీ రాజకీయాలు చోటు చేసుకోవడంతో తర్వాత ఎటువంటి ఆక్రమణలు తొలగించకుండానే రహదారి నిర్మించారు కాలువలు రహదారులు ఆక్రమించారని ఆక్రమణదారులకు అధికారులు అప్పట్లోనే నోటీసులుకూడా ఇచ్చారు కొందరు పెద్దలు ఆక్రమణదారుల నుంచి పెద్ద ఎత్తున ముడుపులు దండుకొని ఆక్రమణ జోలికి పోకుండా అధికారులపై తీవ్రస్థాయిలో ఒత్తిడి తెచ్చి సఫలీకృతులయ్యారు దీంతో ఎటువంటి ఆక్రమణలు తొలగించ కుండానే పట్టణంలో జాతీయ రహదారి నిర్మించారు పేరుకే జాతీయ రహదారి కానీ గతంలో రహదారి ఎలా ఉండేదో ఇప్పుడు కూడా అలాగే ఉంది గతంలో మున్సిపల్ పాలకవర్గం అధికారులు కొన్ని అక్రమ కట్టడాలు తొలగించినప్పటికీ రాజకీయ ఒత్తిడి ల కారణంగా ఆక్రమాల తొలగింపు పూర్తిస్థాయిలో జరగలేదు తొలగించిన కట్టడాల స్థానంలో తిరిగి నిర్మాణాలు జరిగాయి తమ ఆస్తిని ఆక్రమించి నిర్మాణాలు చేశారని ఆర్టీసీ అధికారులు సంవత్సరాల తరబడి చెబుతున్న వారి రోదన అరణ్య రోదనగా మారింది పోరుమామిళ్ల రహదారిలో ఆక్రమణ సంగతి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రహరీ గోడ ఆక్రమించి పలు దుకాణాలు వెలిశాయి బాడుగల్కి ఇచ్చి ప్రతినెల వేల రూపాయలు దండుకుంటున్నారు

# బుల్లి బిపాసా ముఖాన్ని ఇంకా దాచేస్తే ఎలా?



మహేష్ 'టక్కరి దొంగ' సినిమాతో టాలీవుడ్ కి పరిచయమైన బిపాసా బసు తెలుగు యువత మనసులను దోచింది. పెద్ద తెరపై బిప్స్ అందానికి దాసోహం కాని యువకుడు లేడు. కానీ ఆ తర్వాత ఎందుకనో బిపాసా తెలుగు పరిశ్రమలో నటించలేదు. బాలీవుడ్ లో రేస్- ధూమ్ సహా పలు క్రేజీ ప్రాజెక్టుల్లో నటించి భారీ ఫాలోయింగ్ సంపాదించిన బిపాసా చాలా కాలం పాటు 'పఠాన్' విలన్ జాన్ అబ్రహాంతో సహజీవనం సాగించింది. కానీ కాలక్రమంలో ఈ జంట బ్రేకప్.. అటుపై టీవీ నటుడు కరణ్ సింగ్ తో ప్రేమాయణం అనంతరం పెళ్లి .. ఇటీవల వారసుడి జననం వగైరా తెలిసిన వ్యవహారాలే.నవంబర్ 2022లో కరణ్ సింగ్ గ్రోవర్ తో తన మొదటి బిడ్డకు తల్లి అయిన బిపాసా తన పసికందు దేవి ఫోటోల(ముఖం పాక్షికంగా కప్పేస్తూ)ను ఇప్పటికే పలుమార్లు షేర్ చేసారు. ఇప్పుడు మరో కొత్త ఫోటోని బిపాసా బసు పోస్ట్ చేసింది. ఈ అందమైన స్నాప్ కి కారకుడైన వివాన్ భతేనాకు బసు కృతజ్ఞతలు తెలియజేసింది.2022 నవంబర్ 12న తమ మొదటి ఆడ బిడ్డకు జన్మనిచ్చినట్లు కరణ్-బిపాసా జంట ప్రకటించారు. ఇన్ స్టా ప్రకటన లో బేబి దేవి బసు సింగ్ గ్రోవర్ అని పేరును వెల్లడించారు. నవజాత శిశువు చిరు పాదాల ఫోటోను ఆవిష్కరిస్తూ కరణ్ సింగ్ గ్రోవర్- బిపాసా బసు జంట తమ కుమార్తె పుట్టినట్లు ప్రకటించారు.12.11.2022న దివ్యమైన ఇందిరా బసు సింగ్ గ్రోవర్ కి మీ ప్రేమ ఆశీర్వాదాలు కావాలి అని కోరారు. అప్పటి నుండి తమ కుమార్తెను వదిలి క్షణం కూడా ఉండటం లేదు ఈ జంట. ప్రతిసారీ సామాజిక మాధ్యమాల్లో ఫోటోని షేర్ చేసినా ముఖం కనబడకుండా జాగ్రత్త పడ్డారు. పాప దేవి ముఖాన్ని ఎమోజీలతో కప్పి ఉంచుతూ తమ బుల్లి యువరాణిని ఇన్నాళ్లు దాచేశారు. బిపాసా ఇప్పుడు తన కుమార్తె దేవితో సమయం గడిపిన మరొక అందమైన ఫోటోను షేర్ చేసింది. ఈ ఫోటో ఎంతో స్వీట్ గా ఉందంటూ అభిమానుల కితాబు అందుకుంది.బిపాసా బసు తన రెండు నెలల కుమార్తె దేవి పాదాలను తన చేతులతో పట్టుకుని ఈ ఫోటోలో కనిపించింది. చిన్నారి పాపాయి పాదాలను తన చెంపలను తాకే వేళ ఆ అమూల్యమైన క్షణాన్ని ఆస్వాధిస్తూ కనిపించింది. ఆమె ఆనందాన్ని ఈ క్షణం అస్సలు దాచుకోలేదు. ఇది అనితర సాధ్యమైన ఆనందం. ఈ ఫోటోలో బిపాసా తెల్లటి కోల్డ్-షోల్డర్ డ్రెస్ లో కనిపించగా.. నీలిరంగు దుస్తులతో పాపాయి దేవి చక్కందం ఆకట్టుకుంది. నటుడు వివాన్ భతేనా ఈ ఫోటోను తీశాడు. బిపాసా అటువంటి అరుదైన మూవ్ మెంట్ ని కెమెరాలో ఫ్లాష్ మెరిపించినందున అతనిని అభినందించింది. ఈ ఫోటోకి క్యాప్షన్ లో తల్లిదండ్రులుగా అత్యంత అందమైన పాత్ర పోషిస్తున్నామని పేర్కొంది. నా జీవితంలో అత్యంత అందమైన పాత్ర 'దేవి'. మా దుర్గా తో ఈ సమయాన నేను అనందకర క్షణాలను ఆస్వాధిస్తున్నాను. మంకీ లవ్.. మెమరీస్ ఆఫ్ దేవి అంటూ హ్యాష్ ట్యాగులతో ఈ ఫోటోలను వైరల్ చేసింది బిప్స్.గత నెలలో ఆమె పోస్ట్ చేసిన ఒక వీడియోలో బిపాసా బసు తన కుమార్తె దేవి పాదాలను తాకుతూ లాలించడం ఆకర్షించింది. దేవుడు నాకు ఉత్తమ బహుమతిని ఇచ్చాడు అంటూ కృతజ్ఞతా భావాన్ని ఆ లేఖలో రాసింది. నా కుమార్తె దేవి నా మొదటి ఉత్తమ బహుమతి.. నా జీవితంలోని ప్రేమ... నా భర్త...అంటూ ఆనందం వ్యక్తం చేసింది. అయితే ప్రతిసారీ పాపాయి ముఖాన్ని మాత్రం దాచేస్తోంది. దీంతో అభిమానులు పాప ముఖాన్ని ఇంకా ఎన్నాళ్లు దాచేస్తావ్ బిప్స్ ? అని ప్రశ్నిస్తున్నారు.కెరీర్ మ్యాటర్ కి వస్తే... బిపాసా ప్రస్తుతం తన భర్తతో కలిసి టీవీ షోలు సినిమాలు నిర్మిస్తున్నారు. బిజీ ఎంటర్ ప్రెన్యూర్ గా కొనసాగుతూనే వారసురాలి భవిష్యత్ గురించి కలలు కంటోంది. ఈ మధుర క్షణాలను బిపాసా ఎంతో ఆస్వాధిస్తోంది.




# డబ్ల్యూటీసీ ఫైనల్ తేదీని ప్రకటించిన ఐసీసీ



ప్రతిష్ఠాత్మక ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్(డబ్ల్యూటీసీ) 2021- 23 సీజన్ ఫైనల్ తేదీని అంతర్జాతీయ క్రికెట్ మండలి ఖరారు చేసింది.ఇంగ్లండ్‌లోని ప్రఖ్యాత ఓవల్ వేదికగా జూన్ 7న ఫైనల్ మ్యాచ్ ఆరంభం కానుందని పేర్కొంది. జూన్ 12ను రిజర్వుడేగా ప్రకటించింది. ఈ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేసింది. కాగా తొలి డబ్ల్యూటీసీ టైటిల్ గెలిచిన జట్టుగా న్యూజిలాండ్ చరిత్రకెక్కిన విషయం తెలిసిందే.ఇంగ్లండ్‌లోని సౌతాంప్టన్‌లో జరిగిన ఫైనల్లో టీమిండియాను ఓడించి తొలిసారి ఐసీసీ ట్రోఫీని ముద్దాడింది. ఇక తాజా సీజన్‌లో ఫైనల్ బెర్తును ఖరారు చేసుకునే క్రమంలో ఆస్ట్రేలియా, టీమిండియా పోటీ పడుతున్నాయి. ఇప్పటి వరకు టాప్-2లో ఉన్న ఈ రెండు పటిష్ట జట్ల మధ్య ఫిబ్రవరి 9 నుంచి ఆరంభం కానున్న బోర్డర్- గావస్కర్ ట్రోఫీ కీలకం కానుంది.అయితే, ఆస్ట్రేలియా 136 పాయింట్ల(75.56 పర్సంటైల్)తో డబ్ల్యూటీసీ పట్టికలో ప్రథమ స్థానంలో ఉండగా.. భారత్ 99 పాయింట్లతో రెండో స్థానంలో కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో టీమిండియా ఈ సిరీస్ తప్పక గెలవాల్సిన పరిస్థితి నెలకొంది. ఏకపక్షంగా సిరీస్ గెలిస్తే నేరుగా ఫైనల్లో అడుగుపెడుతుంది. అలా అయితే కంగారూలకు కష్టాలు తప్పవు.ప్రస్తుత సమీకరణల దృష్ట్యా ఆసీస్ దాదాపు ఫైనల్ బెర్తును ఖరారు చేసుకున్నట్లనిపిస్తున్నా.. శ్రీలంక, సౌతాఫ్రికా జట్లకు మిగిలి ఉన్న సిరీస్‌ల ఫలితాలు తేలే వరకు వేచి చూడాల్సిందే. పాయింట్ల పట్టికలో మూడు, నాలుగు స్థానాల్లో ఉన్న శ్రీలంక, సౌతాఫ్రికా మిగిలిన సిరీస్‌లు ఆడిన తర్వాతే ఫైనలిస్టులకు సంబంధించి స్పష్టత వస్తుంది.ఇక క్రికెట్ మక్కాగా పిలుచుకునే ప్రఖ్యాత లార్డ్స్ మైదానం డబ్ల్యూటీసీ ఫైనల్‌కు ఆతిథ్యం ఇస్తుందని ఐసీసీ గతంలో ప్రకటించింది. అయితే, ఆ తర్వాత ఓవల్‌కు వేదికను మార్చింది. కాగా ఓవల్ స్టేడియం దక్షిణ లండన్‌లోని కెన్నింగ్‌టన్‌లో ఉంది. 1845లో దీనిని ప్రారంభించారు.అప్పటి నుంచి ఇది సర్రే క్రికెట్ కంట్రీ క్లబ్‌కు హోం గ్రౌండ్‌గా ఉంది. 1880లో మొదటి అంతర్జాతీయ టెస్టుకు ఇంగ్లండ్ ఇక్కడే ఆతిథ్యమిచ్చింది. ఇదిలా ఉంటే.. ప్రతి సీజన్‌లో స్వదేశంలో ఆఖరి టెస్టును ఇంగ్లండ్ ఇక్కడే ఆడటం ఆనవాయితీగా కొనసాగుతోంది.

# సంక్రాంతి విన్నర్స్.. గత ఐదేళ్ల ట్రాక్ ఇది!

సంక్రాంతి పండుగ అంటే తెలుగు వారికే కాదు సినీ పరిశ్రమకు కూడా ఇదొక పెద్ద పండగ. ఏడాది ఆరంభంలో వచ్చే ఈ పండగ పర్వదినాన్ని పురస్కరించుకుని థియేటర్లలో సినిమాల జాతర మామూలుగా ఉండదు. పెద్ద పెద్ద స్టార్స్ తమ సినిమాలను ఈ పండగకే ప్లాన్ చేసుకుంటారు. నిర్మాతలు



కూడా ఈ పండగక్కి బాగా మె?గ్గు చూపుతారు. అలా 2023 సంక్రాంతిలోనూ భారీ చిత్రాలు విడుదల అయ్యాయి. బాలకృష్ణ వీర సింహా రెడ్డి చిరంజీవి వాల్తేరు వీరయ్య బరిలో నిలిచాయి.తమిళం నుంచి వారిసు తునివు రిలీజ్ చేశారు. అసలే ప్రేక్షకులకి పండగ వచ్చే వరకు ఏఏ సినిమాలు వస్తాయనే అసక్తి.. పండగ ముగిశాక ఏ చిత్రాలు ఎంత మొత్తంలో సాధించాయి అని కనుక్కోవడంలో ఆసక్తి. అయితే ఇప్పుడు సంక్రాంతి జాతర ముగియడంతో ప్రేక్షకుల దృష్టి ఇప్పుడు ఈ పండగ బరిలో ఎవరు గెలిచారు అనే విషయమై పడింది.ఇక ఈ విషయానికొస్తే.. ఈ సంక్రాంతి లో చిరంజీవి వాల్తేరు వీరయ్య బాలకృష్ణ వీర సింహారెడ్డి రెండు విజేతగా నిలిచాయి. కలెక్షన్స్ పరంగా చూసుకుంటే వాల్తేరు ప్రపంచవ్యాప్తంగా రూ. 200 కోట్లకు పైగా వసూలు చేయగా వీరసింహారెడ్డి రూ.120 కోట్లకు పైగా కలెక్ట్ చేసింది. అంటే చిరునే బాలయ్యపై పై చేయి సాధించినట్లు అయింది. మరి గత ఐదేళ్లుగా చూసుకుంటే ఈ సంక్రాంతి బరిలో ఏఏ చిత్రాలు పోటీకీ దిగాయి? అత్యధిక వసూళ్ళతో విన్నర్స్ గా నిలిచిన మూవీస్ ఏంటి? ఆ వివరాలు కూడా తెలుసుకుందాం2019 సంక్రాంతికి రామ్ చరణ్ వినయ విధేయ రామ బాలయ్య ఎన్టీఆర్ కథానాయకుడు వెంకీ-వరుణ్ ల మల్టీస్టారర్ ఎఫ్ 2 విడుదలయ్యాయి. అనూహ్యంగా ఎఫ్2 విజయం సాధించింది. 2020లో అల వైకుంఠపురంలో సరిలేరు నీకెవ్వరు ఎంత మంచివాడవురా రిలీజ్ అయ్యాయి. కళ్యాణ్ రామ్ ఎంత మంచివాడవురా ప్లాప్ కాగా... మహేష్ అల్లు అర్జున్ చిత్రాలు రెండూ బ్లాక్ బస్టర్స్ గా నిలిచాయి. ఎక్కువ వసూళ్లతో అల్లు అర్జున్ సంక్రాంతి విన్నర్ గా నిలిచాడు.2021లో రవితేజ క్రాక్ సంక్రాంతి విన్నర్ గా నిలిచింది. ఆ ఏడాది రామ్ పోతినేని రెడ్ బెల్లంకొండ సాయి శ్రీనివాస్ అల్లుడు అదుర్స్ తో పాటు సైకిల్ మెయిల్ అనే రెండు చిన్న చిత్రాలు విడుదలయ్యాయి.రెడ్ యావరేజ్ టాక్ తెచ్చుకాగా.. అల్లుడు అదుర్స్ ప్లాప్ అయ్యింది. కరోనా ఆంక్షల నేపథ్యంలో 2022లో బంగార్రాజు హీరో రౌడీ బాయ్స్ సూపర్ మచ్చి చిత్రాలు విడుదలయ్యాయి. చిన్న చిత్రాల మధ్య రిలీజ్ అయిన బంగార్రాజు సంక్రాంతి విన్నర్ అయ్యింది. ఇక ఈ ఏడాది సంక్రాంతి బరిలో వీరసింహారెడ్డి వాల్తేరు వీరయ్య కళ్యాణం కమనీయం చిత్రాలు దిగాయి.

# 'స్వచ్ఛమైన గాలి పీలుస్తుంటే హాయిగా ఉంది'

టీమిండియా స్టార్ క్రికెటర్ రిషబ్ పంత్ రోడ్డు ప్రమాదం నుంచి కోలుకుంటున్నాడు. గతేడాది డిసెంబర్‌లో ఢిల్లీ నుంచి వస్తుండగా రూర్కీ సమీపంలో ఈ ప్రమాదం జరిగింది.కాగా యాక్సిడెంట్‌లో పంత్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ప్రస్తుతం అతడు ముంబయిలోని ధీరూభాయ్ అంబానీ ఆసుపత్రిలో వైద్యుల పర్యవేక్షణలో చికిత్స తీసుకుంటున్నాడు. దాదాపు 40 రోజులుగా ఆసుపత్రిలో ఉన్న పంత్ తన ఆరోగ్యం గురించి తాజాగా సమాచారం ఇచ్చాడు.బాల్కనీలో కూర్చున్న ఫొటోను పంత్ తన ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశాడు. ఇన్నాళ్లకు బయటకు వచ్చి స్వచ్ఛమైన గాలి పీల్చుకున్నట్లు తెలిపాడు. "ఇలా బయట కూర్చొని స్వచ్ఛమైన గాలి పీలుస్తుంటే ఇంత హాయిగా ఉంటుందని ఎప్పుడూ అనుకోలేదు. ఆల్ ఈజ్ వెల్" అని పంత్ క్యాప్షన్ ఇచ్చాడు.పంత్ షేర్ చేసిన ఫోటోలను బట్టి చూస్తే ఆ ప్రదేశం ఆసుపత్రి ఆవరణలోనిదే అని అర్థమవుతుంది. కాగా మోకాళ్లకు శస్త్రచికిత్స కావడంతో అతను తిరిగి మైదానంలోకి రావడానికి కనీసం ఆరు నెలలు పట్టే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో అతను ఐపీఎల్ సీజన్ మొత్తానికి దూరం కానున్నాడు.పంత్ బెడ్ రెస్ట్‌లో ఉండటంతో ఈ ఏడాది జరిగే కీలక సిరీస్‌లు, టోర్నీలకు దూరంగా ఉండాల్సి ఉంటుంది. ఫిబ్రవరి, మార్చి నెలల్లో జరిగే ఆస్ట్రేలియా సిరీస్, ఆతర్వాత జరిగే ఐపీఎల్, వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్, ఆసియా కప్, వన్డే వరల్డ్‌కప్‌లను పంత్ బెడ్‌పై నుంచే వీక్షించాల్సి ఉంటుంది.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**